PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 14 | విజయవాడ, సోమవారం 14 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 14 August 2023 | Rs

ఐఐటి-ఢిల్లీలో పరీక్షల కుదింపు

- ఒక సెట్ మిడ్
- సెమిస్టర్ పరీక్ష రద్దు

● లోపలి పేజీలో..●

సాగరతీరంలో ఎపిఎల్ 3కె రన్



ఎపిఎల్ 3కె రన్‌లో పాల్గొన్న అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, హరివెంకట కుమారి

● లోపలి పేజీలో..●

చిన్నారులకు టిటిడి ఆంక్షలు

- 15 ఏళ్ల లోపు వారికి మధ్యాహ్నం రెండు వరకే అనుమతి
- ఘాట్ రోడ్లలో సాయంత్రం ఆరునుంచి ఉదయం ఆరు వరకు రాకపోకలు నిలుపుదల



ఏడో మైలు వద్ద చిన్నారులకు 'ట్యాగ్'లు వేస్తున్న టిటిడి సిబ్బంది

ప్రజాశక్తి - తిరుమల, అమరావతి బ్యూరో

శ్రీవారి సందర్శనార్థం కాలిబాట నుంచి వచ్చే యాత్రికుల భద్రతపై టిటిడి చర్యలు చేపట్టింది. నడకదారుల్లో పిల్లల అనుమతిపై పలు ఆంక్షలు విధించింది. 15 ఏళ్లలోపు పిల్లలు గల తల్లిదండ్రులను ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో అనుమతించాలని టిటిడి నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం ఆరు గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలుపుదల చేసింది. ఏడవ మైలు వద్ద నుంచి చిన్న పిల్లల చేతికి పోలీసులు ట్యాగ్ వేస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోతే సులభంగా కనిపెట్టేందుకు ట్యాగులపై పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నెంబర్, పోలీసు టోల్ ఫ్రీ నెంబర్‌ను సిబ్బంది జతపరుస్తున్నారు. నడకదారి మార్గంలో అడవి మృగాలు సంచరించే ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ వన్య మృగాలు నడకదారి దగ్గరకు రాకుండా ఉండేందుకు అవసరమైన సెంట్రీ పోస్టులు, సీసీ కెమెరాలు, ఫెన్సింగ్ వంటివి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జంతువులు వస్తే దూరంగా తరిమేందుకు అవసరమైన లైటింగ్ సిస్టం, సౌండింగ్ సిస్టంలను సిద్ధం చేస్తున్నారు. క్రూరమృగాల సమస్య పరిష్కారమయ్యే వరకు టిటిడి తీసుకున్న నిర్ణయాలకు యాత్రికులు సహకారం అందించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. కాలినడక మార్గాలు, ఘాట్‌లలో యాత్రికుల భద్రత దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం టిటిడి ఛైర్మన్ శ్రీ భూమనకరుణాకర్ రెడ్డి తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.

జూన్ 22న కర్నూలు జిల్లాకు చెందిన నాలుగేళ్ల కౌశిక్‌పై చిరుత దాడి మరవక ముందే నెల్లూరు జిల్లా పోతిరెడ్డి పాలేనికి చెందిన దినేష్‌కుమార్ కుమార్తె లక్షితపై చిరుత దాడి చేసి చంపేయడం కలకలం సృష్టించింది. దాడికి పాల్పడిన చిరుతను బంధించడానికి టిటిడి అటవీ అధికారులు బోన్లను ఏర్పాటు చేశారు. తిరుమల రెండవ ఘాట్‌లో 38వ మలుపు వద్ద చిరుత ఆనవాళ్లు ఉండటంతో ఆదివారం మరో బోనును ఏర్పాటు చేశారు.

నడకమార్గంలో మళ్ళీ కనిపించిన చిరుత

నడకమార్గంలో 2450 మెట్టు వద్ద చిరుతపులి మళ్లీ కనిపించడంతో టిటిడి మరోసారి ఉలిక్కిపడింది. ఘటనా స్థలానికి అటవీ అధికారులు చేరుకున్నారు. ఏడో మైలు వద్ద నుంచి నరసింహస్వామి ఆలయం వరకూ గుంపులు గుంపులుగా యాత్రికులను టిటిడి అనుమతిస్తోంది. అలిపిరి నుంచి గాలిగోపురం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, 38వ మలుపు ప్రాంతాలు కలిపి మొత్తం ఐదు ప్రాంతాల్లో శనివారం రాత్రి చిరుత పులుల సంచారం కనిపించింది.

నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్

చిరుత దాడిలో నెల్లూరు జిల్లాకు చెందిన ఆరేళ్ల చిన్నారి లక్షిత మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ కోరింది. ఈ మేరకు ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం, అటవీ, పోలీస్, రెవెన్యూశాఖలకు బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరారు. తిరుమలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మహారాష్ట్రలో ఘోరం

- థానే ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకేరోజు 18 మంది మృతి
- పోలీసుల మోహరింపుతో భయాందోళనలు

ముంబయి : మహారాష్ట్రలో ఘోరం చోటుచేసుకుంది. థానేలోని కల్వాలో ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కరోజే 18 మంది రోగులు అనుమానస్పద రీతిలో మరణించడం కలకలం రేపింది. ఆసుపత్రి వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరింపజేశారు. దీంతో స్థానిక ప్రజానీకంలో భయాందోళనలు నెలకొన్నాయి. 24 గంటల వ్యవధిలో 18 మంది చనిపోయిన విషయాన్ని పురపాలక శాఖ కమిషనరు అభిజిత్ బంగార్ ఆదివారం సాయంత్రం వెల్లడించారు. వీరిలో 10 మంది మహిళలున్నారు. మృతుల్లో థానేకి చెందినవారు ఆరుగురు, కల్యాణ్‌కు చెందినవారు నలుగురు, షాపూర్ నుంచి ముగ్గురు, భీవాండి, ఉల్హాస్‌నగర్, గోవండి (ముంబయి) నుంచి ఒక్కొక్కరు ఉన్నారని, మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. వీరిలో 12 మంది 50 ఏళ్ల పైబడినవారేనని వెల్లడించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆరా తీశారని, మరణాలపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తునకు ఆదేశించామని కమిషనర్ తెలిపారు. అయితే ఆసుపత్రిలో వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరింపజేయడంతో నగర ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కిడ్నీలో రాళ్ళ, దీర్ఘకాలిక పక్షవాతం, న్యుమోనియా తదితర సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నవారే చనిపోయినవారిలో అత్యధికులని కమిషనర్ పేర్కొన్నారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే రోగులు చనిపోయినట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీంతో ఈ కోణంలోనూ దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. సాధారణంగా రోజూవారీ అందే సమాచారం ప్రకారం ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ ఆరేడు మంది చనిపోతుంటారని, అయితే 24 గంటల్లో 18 మంది చనిపోవడం అసాధారణమని థానే డిసిపి గణేశ్ గావ్డే చెప్పారు. పెద్ద సంఖ్యలో మరణాల నేపథ్యంలో ఆస్పత్రి వద్ద అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పెద్దయెత్తున పోలీసులు మోహరించినట్లు ఆయన వెల్లడించారు.

ఐపిసి చట్టాల్లో మార్పులు ప్రమాదకరం

ప్రశ్నించేవారి గొంతు నొక్కుతున్నారు

- మతోన్మాదంతో యువతను తప్పుదోవ పట్టిస్తోన్న బిజెపి
- సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో 70 ఏళ్ల తరువాత కీలకమైన ఐపిసి, సిఆర్‌పిసి చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులు ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమని సామాజిక కార్యకర్త, ప్రముఖ న్యాయవాది తీస్తా సెతల్వాద్ అన్నారు. 'ప్రజాస్వామ్యం పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ' అనే అంశంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) రాష్ట్ర మహాసభ సందర్భంగా గుంటూరులో ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనలో అన్ని తరగతుల అభిప్రాయాలకు ప్రాతినిధ్యం లభించడంతో సమానత్వానికి ప్రాధాన్యం వచ్చిందన్నారు. ఎన్‌డిఎ హయంలో పార్లమెంటులోనే రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందన్నారు. ఇప్పుడు రూపొందిస్తున్న చట్టాలు, చట్ట సవరణలు అన్నీ ఏకపక్షంగా జరుగుతున్నాయని తెలిపారు. తాజాగా ఐపిసి, సిఆర్‌పిసి చట్టాల్లో మార్పులు భవిష్యత్తు తరాల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా వివిధ కేసుల్లో పోలీసు కస్టడిని 15 రోజులకు మించకుండా ప్రస్తుత చట్టాలు ఉండగా కొత్త చట్టాల్లో 15 రోజుల నుంచి 45 రోజులకు, తరువాత 90రోజులకు పెంచుకునే వెసులుబాటు ఉండటం వల్ల పోలీసు రాజ్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందువల్ల రాజకీయంగా కక్ష సాధించేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో రచయితలు, కవులు కూడా తమ కవితలు, రాతల ద్వారా ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పించారని గుర్తు చేశారు. ప్రశ్నించడం నేరంగా భావించి గత తొమ్మిదేళ్ల కాలంగా కేంద్రం వేధిస్తోందన్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిది కాదని తెలిపారు. వామపక్షాల మద్దతుతో కొనసాగిన యుపిఎ ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు సంబంధించిన ఎన్నో మెరుగైన చట్టాలు వచ్చాయన్నారు. ఎన్‌డిఎ హయంలో ప్రతి చట్టంలోనూ ప్రజల మధ్య విద్వేషాలు పెంచడం, అధికార కేంద్రీకరణ, ప్రశ్నించే తత్వాన్ని నియంత్రించేలా వ్యవహరించడం పరిపాటిగా మారిందన్నారు. దేశంలో నెలకొన్న విచ్ఛిన్నకర పరిస్థితులపై మేధావులు, న్యాయవాదులు, కవులు, సాహితీవేత్తలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్స్‌ను ప్రవేశపెట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం కార్పొరేట్ల నుంచి అత్యధిక విరాళాలు తీసుకుని వీటిని మత విద్వేషాలను పెంచడం కోసం ఉపయోగించుకుంటోందన్నారు. 37 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం తాము ఏం చేసినా చెల్లుతుందనే నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానాన్ని తొలగించడం ఇందులో భాగమేనని అన్నారు. మతపరమైన రాజ్యాంగంగా మార్చడానికి బిజెపి అనేక చట్టాలను తీసుకువస్తోందని చెప్పారు. మతపరమైన భావజాలంతో 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతను బిజెపి తన వైపుకు తిప్పుకోవడానికి ఎన్నో కుయుక్తులు పన్నుతుందన్నారు. 2024నాటికి పార్లమెంటులో 52 శాతం మంది ధనిక ఎంపిలు ఉన్నారని, 2040 నాటికి ఈ సంఖ్య 80 శాతానికి పెరుగుతుందన్నారు. అప్పుడు పేదల గురించి, అభాగ్యుల గురించి చర్చించే వారే లేకుండా పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.జి.శంకర్ మాట్లాడుతూ గుజరాత్ హైకోర్టులో రాహుల్‌గాంధీకి బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ జడ్జి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. పరువు నష్టం కేసుల్లో గరిష్ట శిక్షా కాలాన్ని అమలు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రులు డొక్కా మాణిక్య వర ప్రసాద్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఐలూ అఖిల భారత కార్యదర్శి,సుప్రీంకోర్టు న్యాయవాది సురేంద్రనాథ్, ఐలూ రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్, జెకెసి న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఐలూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కె.పార్థసారధి, సమాచార చట్టం కార్యకర్త పట్నాయక్, ప్రొఫెసర్ ఎన్.రంగయ్య తదితరులు ప్రసంగించారు. సెమినార్‌కు ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న తీస్తా సెత్వలాద్

స్వతంత్ర బాహ్య విచారణ జరిపించాలి

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై డెలాయిట్ ● అదానీ గ్రూపు నుంచి ఆడిటర్ పదవికి రాజీనామా

న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ సంస్థలో కంపెనీలో అక్రమాల భాగోతం మరోసారి తెరపైకి వచ్చింది. అదానీ పోర్టుల వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించే లండన్‌కు చెందిన ప్రముఖ ఆడిట్ కన్సల్టెంగ్ సంస్థ డెలాయిట్ ఆడిటర్‌గా వైదొలగటానికి ముందు అదానీ గ్రూపుపై అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై స్వతంత్ర బాహ్య విచారణ జరిపించాలని కోరింది. అదానీ అవినీతి, అక్రమాలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఇది మరింత బలం చేకూర్చుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మోడీ ప్రభుత్వం దన్నుతో హిండెన్‌బర్గ్ రిపోర్టును బేఖాతరు చేసిన అదానీ గ్రూపు ఇప్పుడు డెలాయిట్ చేసిన సూచనను కొట్టిపడేసింది. ఈ ఆరోపణలు ఏవీ ఆర్థిక నివేదికలపై ఎటువంటి ప్రభావమూ చూపలేదని అదానీ గ్రూపు తెలిపింది. ఆడిటర్ పదవికి రాజీనామా చేయటం కోసం డెలాయిట్ చూపిన కారణాలేవీ నమ్మశక్యంగా లేవని అదానీ గ్రూపు పేర్కొంది. డెలాయిట్ రాజీనామా వెనక పెద్ద కథే ఉందని, స్టాక్ మార్కెట్‌పై ఇది ప్రభావం చూపే అవకాశముందని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్రమోడీ కానీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కానీ ఎలాంటి చర్యలకు ఆదేశించకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు.



డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ ఎల్‌ఎల్‌పీ రాజీనామాకు సంబంధించి స్టాక్ ఎక్స్ఛేంజీలతో 163 పేజీల ఫైలింగ్‌లో.. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీసెజ్) తన నాయకత్వంతో సమావేశాలలో.. డెలాయిట్ ఇతర ఆడిటర్‌లుగా విస్తృత ఆడిట్ పాత్ర లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిందని పేర్కొన్నది. అయితే, ఇతర సంస్థలు పూర్తిగా స్వతంత్రంగా ఉన్నందున అటువంటి నియామకాలను సిఫారసు చేయడం తన పరిధిలో లేదని అదానీ గ్రూపు ఈ మేరకు వెల్లడించింది.

కొన్ని నెలల క్రితమే ఆడిటర్‌గా పదవి పొడిగింపు


కొన్ని నెలల క్రితమే ఆడిటర్‌గా సమయం పొడిగింపు జరిగిన తర్వాత.. అదానీ గ్రూపుకు సేవలు అందించటం నుంచి డెలాయిట్ వైదొలగటం మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఇది అదానీ గ్రూపుపై కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. "చట్టబద్ధమైన ఆడిటర్‌గా రాజీనామా చేయడానికి డెలాయిట్ ముందుకు వచ్చిన కారణాలు తగినవి కావని ఏపీసెజ్ ఆడిట్ కమిటీ అభిప్రాయపడింది" అని మాజీ యూనియన్ హెూం కార్యదర్శి, ఆడిట్ కమిటీ ఛైర్మెన్ గోపాల్ కృష్ణ పిళ్లై అన్నారు.

'మేము అదానీ ఇతర కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లము కాదు'

ఏపీసెజ్ ఆడిటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆగస్ట్ 12 రాజీనామా లేఖలో డెలాయిట్ పేర్కొన్నది. "ఎందుకంటే మేము గణనీయమైన సంఖ్యలో ఇతర అదానీ గ్రూప్ కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లం కాదు" అని అందులో వివరించింది. ఈ ఏడాది మార్చి, జూన్ నెలలతో ముగిసిన త్రైమాసికాల ఆర్థిక నివేదికల ఆడిట్‌లో తమ అర్హత కలిగిన అభిప్రాయాన్ని అందించినట్టు పేర్కొన్నది. ఏపీసెజ్.. 2024లో తన తదుపరి వార్షిక సాధారణ సమావేశం జరిగే తేదీ వరకు డెలాయిట్ స్థానంలో బీఓడీ ఇంటర్నేషనల్ స్వతంత్ర సభ్య సంస్థ అయిన ఎంఎస్‌కేఏ అసోసియేట్స్‌ను తన చట్టబద్ధమైన ఆడిటర్‌లుగా నియమించింది. కంపెనీ ఈ విషయాన్ని ఒక ఫైలింగ్‌లో తెలిపింది.

2017 నుంచి ఏపీసెజ్ ఆడిటర్‌గా డెలాయిట్

2017 నుంచి ఏపీసెజ్ ఆడిటర్‌గా ఉన్న డెలాయిట్.. గతేడాది జులైలో మిగతా 2లో



అభివృద్ధిలో అసమానతలు

- తలసరి ఆదాయం దారుణం
- అనేక రంగాలలో వెనుకబాటు
- మోడీ సర్కార్ చెబుతున్న బలోపేత ఆర్థిక వ్యవస్థ అంతా డొల్లే
- విలవిల్లాడుతున్న ప్రజలు

5

దాడులపై సిబిఐ విచారణ

- రాష్ట్రపతి, ప్రధానిలకు చంద్రబాబు లేఖలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనపై పదేపదే జరుగుతున్న దాడులపై సిబిఐ చేత విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు విడివిడిగా లేఖలు రాశారు. తనపై జరుగుతున్న దాడుల వెనుక నేరపూరిత కుట్ర ఉందని పేర్కొన్న ఆయన, వాటిని ప్రాణాంతక దాడులుగా అభివర్ణించారు. ఈ లేఖల్లో ఆయన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదిన జరిగిన ఒక బహిరంగ సభలో సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఉద్దేశ్యపూర్వకంగానే తన భద్రతను తగ్గించినట్లు అర్థమౌతోందన్నారు. తనపై దాడులు చేస్తూ అదే సమయంలో తనపైనే హత్యాయత్నం ఆరోపణతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. తన భద్రతను పునరుద్ధరించిన హైకోర్టు పట్ల కూడా జగన్‌పూర్తి ధిక్కారాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను వివరించేందుకు రాష్ట్రంలో తాను పర్యటిస్తున్నానని, ఈ పర్యటనల్లో అధికారపార్టీ అవినీతి బట్టబయలు అవుతుండటంతో దాడులకువిగుతున్నారని తెలిపారు. ఆగస్టు 4న అంగళ్లులోని మూడు రోడ్ల కూడలిలో తనపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. పుంగనూరు పట్టణంలోకి తనను అనుమతించబోమని వైసిపి గూండాలు బహిరంగంగానే ప్రకటించినా స్థానిక పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసంపై గతంలో డ్రోన్‌లు ఎగురవేశారని,మంత్రి జోగి రమేష్ తన నివాసంపై 2021లో దాడి చేసినా ఇప్పటికీ చర్యలు లేవని పేర్కొన్నారు. పోలీసుల పర్యవేక్షణలోనే వైసిపి గుంపు తనపై రాళ్ళ రువ్వుతుందని వివరించారు. నందిగామ, యర్రగొండ పాలెంలో తనపై ఇలాంటి దాడులు జరిగాయని తెలిపారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సీనియర్ వైద్యులు సుధాకర్ మరణం, వైసిపి ఎంపి రఘురామ కృష్ణంరాజు పోలీసు కస్టడీ, టిడిపి అధ్యక్షులు అచ్చెన్నాయుడు అరెస్టులను వివరించారు. టిడిపి కార్యాలయంపై దాడి ఘటన, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యను రాజకీయ ప్రత్యర్థులపై నెట్టివేయడానికి ప్రయత్నించారని తెలిపారు.




రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేయండి

- ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వేల ప్రైవేటీకరణతో పాటు, ఆస్తులను అమ్మి వేయడం వంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 1973 సంవత్సరంలో జరిగిన చారిత్రక సమ్మె విజయోత్సవ దినోత్సవ వేడుకలు (గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్) వేడుకలు ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ డివిజనల్ సెక్రటరీ కె.రామకృష్ణ అధ్యక్షతన విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ప్రసంగించిన పలువురు రైల్వే ప్రైవేటీకరణ దేశానికి హాని చేస్తుందన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. స్టాఫ్ కనీస అవసరాలు కోసం 30శాతం లీవ్ రిజర్వు, నాలుగు వారాంతపు (30గంటలు) సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణీకుల భద్రత దృష్ట్యా క్రూ లింక్స్ ఖచ్చితంగా పాటించాలని, డివిజన్ స్థాయిలో 539 లోకో రన్నింగ్ కేటగిరీ ఖాళీలు, 47 రన్నింగ్ సూపర్ వైజర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ నేతలు డిమాండ్ చేశారు, రైల్వే రన్నింగ్ కార్మికులపై రైల్వే యంత్రాంగం తీవ్రమైన పని ఒత్తిడిని బలవంతంగా రుద్దుతోందని చెప్పారు. అధిక పనిగంటలు, సెలవులు మంజూరు చేయకపోవడం, వారంతపు సెలవులు సరిగా ఇవ్వకపోవడం, ఖాళీలను భర్తీ చేయకపోవడం వంటి చర్యలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 1973 చారిత్రక సమ్మెలో పాల్గొన్న లోకో పైలెట్లు (వెటరన్) కె.సుబ్రహ్మణ్యం, గోళ్ల భూషరావు,జి, దైవా దీనం, జె.రామ్‌గోపాల్, కె. బాబూరావు, విఎస్ఎన్ బిరావు, కె. ఆనంద్, ఎస్‌వి రావు, మోహన్‌రావులను అసిసియేషన్ సన్మానించింది. వారు మాట్లాడుతూ 1973లో తాము చేసిన సమ్మె చారిత్రక విజయం సాధించిందన్నారు. సమ్మె ఫలితంగా కేంద్ర ప్రభుత్వానికి, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్‌కు మధ్యన 13.08.1973న ఒప్పందం జరిగిందన్నారు. అప్పటి రైల్వే మంత్రి ఎల్ఎన్ మిశ్రా 14.08.1973న ఒప్పందాన్ని పార్లమెంట్‌లో ప్రకటించారన్నారు. తమ పోరాట ఫలితంగా అపరిమితంగా ఉండిన పని విధానం 10 గంటల పనివిధానంగా నిర్ణయించారని, తొలగించిన రన్నింగ్ కార్మికులను తిరిగి నియమించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అసోసియేషన్ సెక్రటరీ విపిఎల్ నరసింహులు, ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ విజయవాడ, డివిజన్ అధ్యక్షులు ఎం. వెంకటేషన్, బ్రాంచ్ ప్రెసిడెంట్ పివి రాము, రాజమండ్రి బ్రాంచ్ అధ్యక్షులు బిసిఎస్ రావు, లోకో పైలెట్లు పాల్గొన్నారు.



డివిజనల్ సెక్రటరీ కె.రామకృష్ణ



అంబాజీపేటలో కొబ్బరి తోట నుంచి కొబ్బరిని లోడ్ చేస్తున్న కార్మికులు

కష్టాల్లో కొబ్బరి రైతు

- నిలకడ లేని ధరలతో మరింత నష్టం
- మందగించిన ఎగుమతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కొబ్బరి రైతుకు మరో కష్టం ఎదురైంది. జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో ధరలు మరింత పతనమయ్యాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో కొబ్బరి రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్‌లో కొత్త కొబ్బరి వెయ్యి కాయలు రూ.7 వేల నుంచి రూ.8 వేల మధ్యలో ధర పలుకుతోంది. గతేడాది ఈ సీజన్‌లో రూ.9 వేల నుంచి రూ.10 వేలకు వరకూ ధర పలకింది. కురిడి కొబ్బరి వెయ్యి కాయలు పాత గండేరా రకం రూ.12 వేలుగా ఉంది. గతేడాది రూ.13 వేలు చొప్పున కొనుగోలు చేశారు. గటగట రకం కొబ్బరి కాయలు గతేడాది రూ.11 వేలు ఉండగా.. ఈ ఏడాది రూ.9 వేలకు మించి లేదు. కురిడి చిట్టి కాయలు గతేడాది వెయ్యి కాయలు రూ.5,500లు ఉండగా ప్రస్తుతం ఇది రూ.4 వేల లోపు ఉంది. నీటి కాయల ధర గతం కంటే రూ.3 వేలకు పడిపోయింది. ప్రస్తుతం వీటి ధర రూ.8 వేలుగా ఉంది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది రైతు వద్ద కాయ ఒక్కటి రూ.11 వరకు పలికింది. పరిమాణాన్ని బట్టి వ్యాపారులు వెయ్యి కాయలను రూ.11 వేల నుంచి రూ.13 వేలకు చొప్పున కొనుగోలు చేసి ఎగుమతి చేశారు. ప్రస్తుతం కేరళలో దిగుబడులు భారీగా రావడంతో దేశీయ మార్కెట్లో కోనసీమ కొబ్బరికి డిమాండ్ తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రొయ్యల చెరువులు పెరగడంతో ఆ ప్రభావం కొబ్బరి కాయల నాణ్యత, దిగుబడులపై చూపుతోందని, దీంతో ప్రతిఏటా నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

1.30 లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. మరో 20 వేల ఎకరాలకు సరిపడా చెట్లు ఇళ్ల వద్ద, పొలాల గట్ల వెంబడి, కాలువ గట్లపైన ఉన్నాయి. ప్రతియేటా జిల్లాలో 105 కోట్ల కొబ్బరి కాయల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా నుంచి తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు కొబ్బరిని ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. అంబాజీపేట మార్కెట్ నుంచి గత శ్రావణ మాసంలో రోజుకు 25 నుంచి 30 లారీలు ఎగుమతులు జరిగేవి. ఈ ఏడాది 10 లారీలకు మించి ఎగుమతులు జరగడంలేదని వ్యాపారులు చెబుతున్నారు.

వెంటాడుతున్న చీడపీడలు

రెండేళ్లుగా కొబ్బరి దిగుబడి తగ్గడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోపక్క ఐదేళ్లుగా కొబ్బరి చెట్లకు ఎర్రనల్లి, తెల్లదోమ, ఆకు తేలు, ఎండాకు తెగులు సోకుతున్నాయి. దీంతో ఆకులు ఎండిపోయి, చెట్లు జీవం కోల్పోవడంతోపాటు పూతకు వచ్చిన గెలల్లో కాయలు తొలిదశలోనే రాలిపోతున్నాయి. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో దిగుబడి అవుతున్న కాయలతో పోల్చితే ఇక్కడ కాయల సైజు తక్కువగా ఉండడంతో జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిపోతుంది.

పెట్టుబడి కూడా రావడం లేదు



గండేరా కురిడి కాయలకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రూ.18 వేలు ధర వస్తేనే గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.12,500 మించి ధర లేదు. శ్రావణంలోనూ ధరలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇటు ధరా లేక అటు ప్రభుత్వ సాయం అందక కుదేలవుతున్నాం. కూలి పనికి వెళ్లే స్థితికి వచ్చాం.

- సుంకర సత్యనారాయణ, వాకల గరువు, కొబ్బరిరైతు, అంబాజీ పేట

ఖర్చులు పెరిగాయి



కొబ్బరి సాగుకు ఏడాదికి రూ.40 వేలు పెట్టుబడి అవుతోంది. నీళ్లపోత, ఎరువులు, పురుగు మందులు, దింపు, ఒలుపు, రవాణా ఖర్చులు పెరగడంతో పెట్టుబడి కూడా రావడంలేదు. ఆక్వా సాగు ప్రభావం తోటలపై తీవ్రంగా ఉంది. దిగుబడులు తగ్గిపోతున్నాయి. తమిళనాడు తరహాలో ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి.

-ముత్యాల జమ్మీలు, కొబ్బరి రైతు, అంబాజీపేట

'సిఎంఒలో డిజిటల్ చోరీ'పై సిఎం స్పందించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి కార్యాలయంలో డిజిటల్ సంతకాల చోరీపై రాష్ట్ర ప్రజలకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడి, డిజిటల్ సంతకాలతో అక్రమాలకు పాల్పడటం విచారకరమన్నారు. చీఫ్ మినిస్టర్ పిటిషన్లు సృష్టించి, సిఎంఒ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లాగిన్, పాస్‌వర్డులు దొంగతనంగా ఉపయోగించి 66 నకిలీ సిఎంపిలు సృష్టించారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన గాడి తప్పిందనటానికి ఇదే నిదర్శమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయానికే భద్రత లేకపోతే, ప్రజలకు ఏముంటుందని ప్రశ్నించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ నుంచి గుంటూరు వస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ (12706) రైలులో పొగలు వచ్చాయి. ఉదయం 9.30గంటల సమయంలో రైలు జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ స్టేషన్ వద్దకు చేరుకోగానే పొగలు రావడాన్ని ప్రయాణికులు గమనించారు. దీంతో రైల్వే సిబ్బంది అప్రమత్తమయ్యారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో పది నిమిషాల పాటు రైలును నిలిపివేసి పూర్తిస్థాయిలో పరిశీలించారు. బ్రేక్ లైనర్లలో పొగలు వచ్చాయని, ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధారించారు. అనంతరం రైలు యథావిధిగా గుంటూరుకు వచ్చింది.

కార్యదర్శులను బిఎల్‌ఒ విధుల్లోంచి తప్పించాలి

- ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తూ.. పనిభారం ఎక్కువగా ఉన్న కార్యదర్శులను బిఎల్‌ఒ (బూత్ లెవల్ ఆఫీసరు) విధుల్లోంచి వెంటనే తొలగించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనూరాధ, ఎం గురుస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే పనిభారం ఎక్కువగా ఉండి ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులకు బిఎల్‌ఒ బాధ్యతలు అప్పగించడంతో మరింత ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని బిఎల్‌ఒ బాధ్యతల నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 2,3న తెలంగాణ గ్రూప్-2 పరీక్ష

- టిఎస్‌పిఎస్‌సి ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్ -2 పరీక్ష తేదీలను మార్చాలన్న అభ్యర్థుల ఆందోళనతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నవంబర్ 2,3న పరీక్షలను నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ఆదివారం వెల్లడించింది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు పేర్కొంది. పరీక్షలకు వారం రోజుల ముందు నుంచి హాల్ టికెట్లను టిఎస్‌పిఎస్‌సి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. 783 గ్రూప్-2 ఉద్యోగాలకు 5,51,943 మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు జరగాల్సి ఉంది. ఆగస్టు నెలలో గురుకుల టీచర్ పరీక్షలు, స్టాఫ్‌నర్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్, ఎస్‌ఎస్‌సి, ఐబిపిఎస్ వంటి పలు పోటీ పరీక్షలు ఉండటంతో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, కార్యదర్శితో సమావేశమై అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి, పరిస్థితులను సిఎంకు నివేదించారు. కెసిఆర్ ఆదేశాల మేరకు పరీక్షలను నవంబరుకు వాయిదా వేసినట్లు టిఎస్‌పిఎస్‌సి ఆదివారం కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది.

న్యాయవాదుల కోసం రక్షణ చట్టం చేయాలి

- ఐలు రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

గుంటూరులోని శుభం కన్వెన్షన్‌లో రెండురోజులపాటు జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ 12వ రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించారు. అడ్వకేట్లపై జరుగుతున్న దాడులకు అరికట్టటానికి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మణిపూర్ హింసను ఆపాలని తీర్మానాలు చేశారు.

సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలని, దక్షిణాదిలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, ఒటిటి ప్లాట్‌ఫారమ్‌లలో వచ్చే వెబ్ సిరీస్‌లో అశ్లీలతను నిరోధించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ తీర్మానాలు ఆమోదించారు. కోర్టుల్లో మహిళా న్యాయవాదులకు, కక్షిదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, చనిపోయిన న్యాయవాదుల కుటుంబాలకు సంక్షేమ నిధిని వెంటనే అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ లాయర్లకు ఇస్తున్న స్టైఫండ్ క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఉపా చట్టాన్ని అన్యాయంగా ప్రయోగించడం ఆపాలని ప్రవేశపట్టిన తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.


నూతన కార్యదర్శిగా నల్లూరి మాధవరావు


నూతన అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

నూతన కమిటీ ఎన్నిక..

ఐలు మహాసభలో 70 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారిలో 25 మందితో కార్యదర్శివర్గం ఎన్నికైంది. ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన డి.రాజగోపాల్ ఎన్నికయ్యారు.

రాష్ట్ర అధ్యక్షులుగా విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్‌ను తిరిగి ఎన్నుకున్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది నల్లూరి మాధవరావు, కోశాధికారిగా కర్నూలు జిల్లాకు చెందిన న్యాయవాది కెంగార కుమార్ ఎన్నికయ్యారు.

రుషికొండపై సచివాలయమే

- కాదు.. కాదు.. పర్యాటకశాఖ భవనాలు
- వైసిపి 24 గంటల్లో యూటర్న్ ట్వీట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మిస్తున్నది సచివాలయమేనని వైసిపి అధికారిక ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్న 24 గంటల్లోనే కాదు.. కాదు.. ఆ భవనాలు రాష్ట్ర పర్యాటకశాఖకు చెందినవి అంటూ మరో ట్వీట్ చేసింది. రాష్ట్ర సచివాలయం కోసమే అక్కడ భవనాలు నిర్మిస్తున్నట్లు శనివారం పార్టీ అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి ట్వీట్ చేసింది. 'ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు జగన్.. విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించి రుషికొండపై సచివాలయం నిర్మిస్తున్నారు. దానిపై కూడా టిడిపి దుష్ప్రచారం చేస్తోంది. ఇది చూస్తుంటే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందటం ఆ పార్టీకి ఇష్టం లేదనిపిస్తోంది' అని ట్వీట్‌లో పేర్కొంది. విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మాణాలకు సంబంధించి మాటమారుస్తూ వైసిపి మరో ట్వీట్ చేసింది. రాష్ట్ర సచివాలయం కోసమే అక్కడ భవనాలు నిర్మిస్తున్నట్లు శనివారం చేసిన ట్వీట్‌ను పొరపాటున చేసినట్లు వెల్లడించింది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలోనే ప్రభుత్వం నిర్మాణాలు చేస్తున్నట్లు తాజా ట్వీట్లో పేర్కొంది.

ఎన్‌టిఆర్ హయాంలోనే రుషి కొండపై నిర్మాణాలు

ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రుషికొండపై నిర్మాణాలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ అధికార బాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు అన్నారు. విజయవాడలోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండ, పొట్టి శ్రీరాములు, గిడుగు రామ్మూర్తి గురించి ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్టును జనసేన అధినేత పవన్ కల్యాణ్ చదువుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో అధికార బాషా సంఘం సభ్యులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతున్నా మోడీ సర్కారు పట్టించుకోకపోవడం శోచనీయమని పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 913వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో హెచ్‌ఎంఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి వారు మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం తనవైఖరి మార్చుకోకపోతే రానున్న కాలంలో ప్రజలు, కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. వారికి రావాల్సిన రూ.2400కు కోత విధించడం దారుణమని పేర్కొన్నారు. కార్మికుల సమస్యపై ఉక్కు యాజమాన్యం చొరవ చూపి పది రోజుల్లో పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు జి.సత్యారావు, ఉరుకూటి అప్పారావు, సుభాషిణి, అప్పలరాజు, యూజ్ సంఘం కార్యదర్శి కె.పరంధామయ్య పాల్గొన్నారు. దీక్షలకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు మద్దతు తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు 2 నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు

- బొప్పరాజు, ఆర్లయ్య డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి రెగ్యులర్ పేస్కేల్ ప్రకారం జీత భత్యాలు చెల్లించాలని ఎపిజెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వి ఆర్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని గవర్నర్‌పేట రెవెన్యూభవన్‌లో గ్రామ, వార్డు సచివాలయ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం వి ఆర్లయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ నేతలు మాట్లాడుతూ.. మొదట విడత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కోల్పోయిన 9 నెలలు, రెండో విడత కోల్పోయిన 5 నెలలకు సంబంధించి ఆర్థిక పరమైన సర్వీస్ అంశాలపైన ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ఎఎన్ఎమ్, విఎఎ (అగ్రికల్చర్), విహెచ్ఎ (హార్టికల్చర్), విఎస్ఎ (సెరికల్చర్) ఉద్యోగులకు ఇంకా బదిలీల ప్రక్రియ మొదలుకాలేదన్నారు. తక్షణమే బదిలీల ప్రక్రియ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంక్షేమ సంస్థ జనరల్ సెక్రటరీ సీపాన గోవిందరావు, కోశాధికారి బగ్గా జగదీష్, ఉపాధ్యక్షులు జి జ్యోతి, సిహెచ్ హరి, జాయింట్ సెక్రటరీ కట్టా శ్రీను పాల్గొన్నారు.

ఒక్కరోజు చదివినా మొత్తం ఫీజు చెల్లించాల్సిందే

- తెలంగాణలో ప్రయివేటు కాలేజీల ఇష్టారాజ్యం..!
- మరో కాలేజీలో జాయిన్ అయ్యేందుకు మెలిక
- టిసి, మెమో ఇవ్వకుండా ఇబ్బందులు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్‌కు చెందిన ఓ విద్యార్థి ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో జాయిన్ అయ్యాడు. ఐదు రోజులు కాలేజీకి వెళ్లాడు. వ్యక్తిగత కారణాల రీత్యా మరో కాలేజీలో చేరాలనుకున్నాడు. టిసి, పదో తరగతి మెమో కావాలని కాలేజీలో దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటికే కొంత ఫీజు చెల్లించగా.. మిగిలిన ఫీజు మొత్తం చెల్లిస్తేనే టిసి, మెమో ఇస్తామని కాలేజీ యాజమాన్యం మెలిక పెట్టింది. దాంతో ఆ విద్యార్థి ఫీజు మొత్తం చెల్లించి మరో కాలేజీలో చేరాల్సి వచ్చింది.

కుత్బుల్లాపూర్‌కు చెందిన మరో విద్యార్థి ఓ జూనియర్ కాలేజీలో జాయిన్ అయ్యాడు. ఇతను కేవలం రెండ్రోజులు మాత్రమే కాలేజీకి వెళ్లాడు. అనుకోని కారణాలతో మరో కాలేజీలో చేరాలనుకున్నాడు. టిసి, మెమో అడిగితే మొత్తం ఫీజు చెల్లిస్తేనే ఇస్తామనడంతో గత్యంతరం లేక చెల్లించాడు.

ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సామాన్యుడు కుస్తీ పడుతుంటే, మరోవైపు పిల్లల చదువులు, వారి ఫీజులు గుండె గుబేల్‌మనిపిస్తున్నాయి. చదువులపై తల్లిదండ్రుల్లో నెలకొన్న మానసిక పరిస్థితిని ఆధారం చేసుకుని తెలంగాణలోని ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. జాయిన్ చేయించుకునే వరకు సుతిమెత్తగా మాట్లాడుతూ.. ఫీజుల వసూళ్లలో ప్రతాపం చూపిస్తున్నాయి. కాలేజీల కాసుల వేటలో విద్యార్థుల తల్లిదండ్రులు అల్లాడుతున్నారు. వేరే కాలేజీలో



చేరతామని చెప్పినా వినిపించుకునేందుకు ససేమిరా అంటున్నాయి. ఒకవేళ మారాలనుకుంటే ఒక్క రోజు కాలేజీకి వెళ్లినా మొత్తం ఫీజులు చెల్లించాలని విద్యార్థులను వేధిస్తున్నాయి.

ఈ సమస్య కేవలం మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులదే కాదు.. ఇంటర్ చదివే విద్యార్థులందరూ ఎదుర్కొంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో దాదాపు 250 వరకు ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. విద్యార్థులపై యాజమాన్యాలు ఫీజుల పడగ విప్పుతున్నాయి. ఒక్క రోజు నుంచి పది రోజుల వరకు తరగతులకు హాజరయ్యాక ఏదైనా కారణంతో మరో కాలేజీలో జాయిన్ అవ్వాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. మొత్తం ఫీజు చెల్లిస్తేనే టిసి, మెమో ఇస్తామని మెలిక పెడుతున్నారు. దీంతో ఇక్కడ మొత్తం ఫీజు చెల్లించి.. మరో కాలేజీలో జాయిన్ అయితే అక్కడా మొత్తం ఫీజు చెల్లించేందుకు తల్లిదండ్రులు నానాకష్టాలు పడుతున్నారు. చదువుపట్ల పిల్లలపై చూపుతున్న ప్రేమను ఈ రకంగా పలు కాలేజీలు ఉపయోగించుకుంటున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రయివేటు కాలేజీల ఫీజు దోపిడీపై విద్యార్థి సంఘాలు అనేక ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు అవేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

దోపిడీ ఇలా..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కార్పొరేట్ కాలేజీల్లో ఏడాది ఫీజు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంది. ఇక సాధారణ జూనియర్ కాలేజీలోని సిఇసి, హెచ్ఇసి కోర్సులకు ఏడాది ఫీజు దాదాపు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంది. ఎంపిసి, బైపిసి కోర్సులకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. మొదట కాలేజీలో చేరేందుకు విద్యార్థి నుంచి అడ్మిషన్ ఫీజు రూపంలో రూ.2-5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆ తర్వాత మొత్తం ఫీజులో రూ.10-20 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒకటి నుంచి పది రోజుల వరకు ఆ కాలేజీలో క్లాసులకు హాజరైన తర్వాత ఆ కాలేజీ నచ్చకనో, మరే ఇతర కారణాలతోనో వేరే కాలేజీలో చేరాలనుకుంటే మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఫీజు చెల్లిస్తేనే టీసీ, మెమో ఇస్తామంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలా మధ్యలో వెళ్లిపోతే తమకు ఒక సీట్ లాస్ అవుతుందని, అందుకే ఫీజు మొత్తం చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి. విద్యార్థికి ఏదైనా కాలేజీ నచ్చకపోతే వేరే కాలేజీలో చేరాలనుకుంటే మొత్తం ఫీజులు వసూలు చేయొద్దనే ప్రభుత్వ నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీన మేషాలు లెక్కిస్తుండటంతో జూనియర్ కాలేజీల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జూనియర్ కాలేజీలపై నిఘా పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి
రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

జూనియర్ కాలేజీల దోపిడీపై జిల్లా ఇంటర్ విద్యాధికారులు స్పందించాలి. ఆ కాలేజీల గురించి తల్లిదండ్రులకు తెలియక పిల్లలను జాయిన్ చేస్తున్నారు. కొన్ని రోజులు తరగతులకు హాజరయ్యాక అక్కడ నచ్చకుంటే మరో కాలేజీకి మారాలంటే మొత్తం ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ, ప్రయివేట్ కాలేజీల్లో ప్రభుత్వ రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే ఆయా కాలేజీలు టిసి, మెమోలు ఇచ్చేలా అధికారులు ఉత్తర్వులు జారీ చేయాలి. జూనియర్ కాలేజీ యాజమాన్యాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి.


మందుబాబులను అదుపు చేస్తున్న పోలీసులు

కాకినాడలో మందుబాబుల వీరంగం

- బార్ సిబ్బందితో వాగ్వాదం, ఘర్షణ
- కానిస్టేబుల్స్‌ను సైతం తోసేసిన వైనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో మందుబాబులు వీరంగం సృష్టించారు. పోలీసులను సైతం లెక్కచేయకుండా తోసివేయడంతో ఉద్రికత్తత చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు..ఆదివారం రాత్రి కాకినాడ భానుగుడి సెంటర్‌లో గురూజీ బార్ అండ్ రెస్టారెంట్లో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించారు. బిల్లు కట్టే సమయంలో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. బారులోనే ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో బార్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు ఎస్ఐలు, ఐదుగురు కానిస్టేబుల్స్ అక్కడికి చేరుకున్నారు. వారిని బార్ నుంచి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో మందుబాబులు మరింత రెచ్చిపోయారు. బార్ సిబ్బందిపై దాడికి దిగారు. పరిస్థితిని అదుపు చేసే సమయంలో ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సైతం మందుబాబులు తోసేశారు. దీంతో మందుబాబుల కాళ్లు, చేతులూ కట్టేసి వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఇప్పటికే ఎస్‌పికి సమాచారం ఇచ్చామని, లీగల్‌గా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు. మందుబాబుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నవంబరు వరకే లోకేష్ పాదయాత్ర !

- తరువాత ఎన్నికలపై దృష్టి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర షెడ్యూల్ మారనున్నట్లు తెలిసింది. ప్రకటించిన షెడ్యూల్ కంటే ముందే ముగించాలని టిడిపి అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. యాత్రను ముగించి సార్వత్రిక ఎన్నికలపై దృష్టి సారించాలని అధిష్టానం భావిస్తోంది. యువగళం పేరుతో నారా లోకేష్ జనవరి 27 నుంచి ప్రారంభించిన పాదయాత్ర ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా తాడికొండలో జరుగుతుంది. 400 రోజులపాటు నాలుగు వేల కిలోమీటర్లు పాటు చిత్తూరు జిల్లా కుప్పం నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర నిర్వహించాలని ముందుగా షెడ్యూల్‌ను పార్టీ నాయకత్వం రూపొందించింది. ఈ ప్రకారం చూసుకుంటే వచ్చే ఏడాది మార్చి 1తో యాత్ర ముగించాల్సి ఉంది. మార్చిలో ఎన్నికల కోడ్‌తో పాటు షెడ్యూల్ కూడా రానుంది. ఎన్నికల సమయంలో యాత్ర సాగితే ఇబ్బందులు వస్తాయనే ఆలోచన పార్టీ నాయకులు చేస్తున్నారు. ఇదే సమయంలో పార్టీ అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. అభ్యర్థుల ప్రకటన, యాత్ర రెండింటిపై పార్టీ దృష్టి సారించడం ఇబ్బందికరమవుతుందని భావిస్తున్నారు. ముందు అనుకున్న షెడ్యూల్‌లో రోజులు మాత్రం తగ్గుతాయని, కిలోమీటర్లలో మార్పు ఉండదని నాయకులు అంటున్నారు. 400 రోజులకు సగటున రోజుకు 10 కిలోమీటర్ల పాటు సాగాలని ముందుగా నిర్ణయించుకోగా, ప్రస్తుతం అది సగటున 15 కిలోమీటర్లు సాగుతోంది. శనివారంతో 2,441 కిలోమీటర్లతో 183 రోజులు పూర్తయింది. ఎన్నికలకు ఇబ్బంది లేకుండా నవంబరు నాటికి యాత్రను ముగించే దిశగా టిడిపి అధినాయకత్వం అడుగులు వేస్తోంది. పాదయాత్ర ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర సాగించాల్సి ఉంది. నియోజకవర్గంలో మూడు రోజుల పాదయాత్రతో పాటు ఒక రోజు బహిరంగ సభ నిర్వహించాలని ఉంది. అయితే ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లో లోకేష్ యాత్ర సాగడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 16 నియోజకవర్గాలు ఉండగా, 7 నియోజకవర్గాల్లో మాత్రమే యాత్ర సాగుతోంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలోని తాడికొండ నియోజకవర్గంలో జరుగుతుంది. ఆ తరువాత మంగళగిరి మీదుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోకి ప్రవేశించనుంది. ఇక్కడ కూడా 7 రోజులపాటు 4 నుంచి 5 నియోజకవర్గాలకే పరిమితం కానుంది. ఉభయగోదావరి జిల్లాల్లో మాత్రం 60 రోజుల పాటు నిర్వహించాలని నాయకత్వం భావిస్తోంది. ఈ రెండు జిల్లాలపై దృష్టి సారిస్తే వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరుగుతాయని ఆలోచన చేస్తుంది. ఈ జిల్లాల్లో ముగిసిన అనంతరం ఉత్తరాంధ్రలోకి ప్రవేశించి నవంబరు చివరి నాటికి పూర్తి చేసేలా పార్టీ రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది.



గోల్డెన్ అవర్ విశ్వవ్యాపితం కావాలి

- శ్రీలంక మంత్రి సతాశివమ్ వియలందేరన్
- వరుణ్ కార్డియాక్ 'గోల్డెన్ అవర్ ప్రాజెక్టు' ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

న్యూరో సర్జన్ డాక్టర్ పువ్వాడ రామకృష్ణ సారథ్యంలో వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ చేపట్టిన 'గోల్డెన్ అవర్' ప్రాజెక్టు విశ్వవ్యాపితం కావాలని శ్రీలంక ఆహార భద్రత, వాణిజ్య వ్యవహారాలశాఖ మంత్రి సతాశివమ్ వియలందేరన్ ఆకాంక్షించారు. 'గోల్డెన్ అవర్' ప్రాజెక్టు ఆవిష్కరణ విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, పక్షవాతానికి గురైన వారికి, తల, మెదడు భాగాల్లో తీవ్రమైన గాయాలైన వారికి తొలిగంట వ్యవధిలో చికిత్సనందిస్తే మెరుగైన ఫలితాలను సాధించవచ్చని తెలిపారు. ఈ చికిత్స కోసం అత్యాధునిక సదుపాయాలు, అగ్రశ్రేణి వైద్య నిపుణులతో ప్రత్యేక న్యూరో విభాగాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టును విస్తృతం చేసేందుకు తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. శ్రీలంక, ఎపి మధ్య బంధం మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ.. బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్ సంభవించిన వెంటనే సరైన చికిత్సను అందించడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని, ఆలస్యమైతే ప్రాణాప్రాయానికి గానీ, జీవికాల వైకల్యానికి గానీ దారి తియొచ్చని చెప్పారు. ముఖంలో పక్షవాత లక్షణాలు, సరిగ్గా మాట్లాడలేకపోవడం, చేతులు పైకెత్తలేకపోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకొక అత్యవసర చికిత్సా విభాగాన్ని నెలకొల్పుతోందని వెల్లడించారు. టెమా-సిఎంఎఐ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎన్‌కె గోయల్ మాట్లాడుతూ.. న్యూరో క్రిటికల్ కేర్‌కు సంబంధించిన అంతర్జాతీయ స్థాయి వైద్య విభాగాన్ని విజయవాడలో నెలకొల్పడం అభినందనీయమని అన్నారు. గోల్డెన అవర్ ప్రాజెక్టు వైద్య రంగంలో నూతన అధ్యాయనాన్ని ఆవిష్కరిస్తుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఇండ్ల రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ రూపకర్త, వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ న్యూరో విభాగం డైరెక్టరు పువ్వాడ రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టును ప్రజలకు చేరువ చేసేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ ఛైర్మన్, ప్రఖ్యాత కార్డియో థోరాసిక్ సర్జన్ డాక్టర్ గుంటూరు వరుణ్, బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ డైరెక్టరు టి సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో వేతన సమస్యలను పరిష్కరిస్తాం

- మహిళా సిబ్బంది రక్షణకు ప్రత్యేక కమిటీ
- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ఏజెన్సీల ద్వారా పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది వేతనాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఆస్పత్రి లెర్నింగ్ సెంటర్‌లో ఏజెన్సీల నిర్వాహకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కొత్తగా టెండర్లు దక్కించుకున్న కార్తీక సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా 140 మంది సిబ్బందిని నియమించారు. 12 మంది మాజీ సైనిక అధికారులను సెక్యూరిటీ ఆఫీసర్లుగా నియమించారు. వారిని ఉద్దేశించి డైరెక్టర్ బీరప్ప మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో నిలిపేలా సూచనలు చేయాలన్నారు. ఏజెన్సీలు వేతనాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బందికి విధి నిర్వహణలో ఏదైనా అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్యం అవసరమైతే ఉచితంగా అందిస్తామని చెప్పారు. మహిళా సిబ్బందిని ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకునేలా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశామని, ఎవరికైనా సమస్య వస్తే ఆ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మి భాస్కర్, కృష్ణారెడ్డితో పాటు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



స్వతంత్ర బాహ్య విచారణ జరిపించాలి

మొదటి పేజీ తరువాయి

మరో ఐదేండ్ల పదవీకాలం పొడిగించబడింది. అయితే అదానీ గ్రూపుపై సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై డెలాయిట్ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే అదానీ గ్రూప్ అవన్నీ నిరాధారమైనవని బుకాయించింది. మోడీ ప్రభుత్వం కూడా అదానీని పూర్తిగా వెనకేసుకొచ్చింది.

స్వతంత్ర బాహ్య విచారణ లేనప్పుడు, సెబీ ద్వారా విచారణ పూర్తి కావడానికి పెండింగ్‌లో ఉన్నందున తాము ఏమీ వ్యాఖ్యానించలేమని డెలాయిట్ తెలిపింది. కాగా, మేలో సుప్రీంకోర్టు నియమించిన ఆరుగురు సభ్యుల నిపుణుల బృందం తన మధ్యంతర నివేదికలో అదానీ గ్రూప్ స్టాక్‌లలో నియంత్రణ వైఫల్యం లేదని వివరించింది. అయితే, లావాదేవీలు, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్‌స్ట్రక్షన్ (పీఈసీ), కొనుగోలు ఒప్పందాల వంటి అంశాలను డెలాయిట్ లేవనెత్తింది. ఇవే అంశాలు హిండెన్‌బర్గ్ నివేదికలోనూ ఉండటం గమనార్హం. " ఈ ఏడాది మార్చి 31 నాటికి కాంట్రాక్టర్ నుంచి రూ. 2,457.05 కోట్ల నికర బ్యాలెన్స్ రికవరీ చేయబడింది. ఇందులో రూ. 713.63 కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లించిన సెక్యూరిటీ డిపాజిట్‌లకు సంబంధించినవి. రూ. 1,501.50 కోట్ల మూలధన అడ్వాన్స్‌లకు సంబంధించినవి" అని పేర్కొన్నది.

ప్రజాశక్తి
www.prajasakti.com

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - తిరుమల, తిరుచానూరు



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ గవాయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఆయనకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సందర్శించారు

అమ్మవారి సేవలో టిటిడి ఛైర్మన్ దంపతులు

టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం భూమన కరుణాకర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సందర్శించారు. ఛైర్మన్‌కు జెఇఒ వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఒ గోవిందరాజన్ స్వాగతం పలికారు.

కమ్యూనిస్టు కృషికి కృష్ణమూర్తి మచ్చుతునక

ప్రజాశక్తి - సోంపేట, పలాస (శ్రీకాకుళం)

కమ్యూనిస్టు కృషికి సిపిఎం సీనియర్ నాయకులు పాతిని కృష్ణమూర్తి మచ్చుతునక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కృష్ణమూర్తి 80వ జన్మదినోత్సవ సభను శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. కృష్ణమూర్తి జీవిత చరిత్ర గురించి 'ఉద్యమ పథంలో నా జ్ఞాపకాలు' అనే పుస్తకాన్ని, ప్రజాశక్తి వెలువరించిన జన్మదిన ప్రత్యేక సంచికను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ బి.తులసీదాస్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజాన్ని మార్చాలన్న దృఢ సంకల్పంతో పనిచేసిన కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. ప్రజా, సామాజిక సమస్యలపై నిరంతర పోరాటం సాగించేవారని తెలిపారు. ఉపాధ్యాయులు, రైతులు, కూలీల సమస్యలపై పోరాటం చేయడమే కాదని... ప్రజాప్రతినిధులు, అధికారులను ఒప్పించి, మెప్పించి సాధించుకునేవారని చెప్పారు. ఉపాధ్యాయునిగా ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని, కమ్యూనిస్టుగా ఎంతోమంది ఉద్యమకారులను తయారు చేశారని తెలిపారు. బెందాళం గవరయ్య, గానుగుల తరుణాచారి, మార్పు పద్మనాభం మరికొంత మందితో కలిసి రైతుసంఘం ఏర్పాటు చేసి మందస జమిందారు ఉద్యమంలో పోరాడారని గుర్తుచేశారు. పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తారని ప్రచారం జరిగినా, జైలు జీవితాన్ని గడిపారు తప్ప పోలీసులకు లొంగిపోలేదన్నారు. మామిడిపల్లిలో ఉద్యమ పునఃనిర్మాణంలో కృష్ణమూర్తి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. 1999 ఎన్నికల్లో సోంపేట సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని పార్టీ కోరినప్పుడు గెలుపోటములను చూడకుండా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పోటీ చేశారని చెప్పారు. మామిడిపల్లి సర్పంచ్‌గా రెండుసార్లు గెలుపొంది ప్రజలకు సేవ చేశారని తెలిపారు. అనంతరం కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. కృష్ణమూర్తి తనయుడు నరేంద్ర వర్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, పిరియా రాజారావు, ఎంపిపి నిమ్మాన దాసు, వాణిజ్య పనుల శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ జుత్తు తాతారావు, మామిడిపల్లి సర్పంచ్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు, వీరయ్య, తులసీదాస్ తదితరులు

పవన్‌కు టిడిపి నేతల కబ్జాలు కనబడవా?

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


టిడిపి నేతల భూ కబ్జాలు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కనబడవా అంటూ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. ఆయన విశాఖ పర్యటనలో చేస్తున్న వ్యాఖ్యల్లో విషం, విద్వేషం తప్ప విషయం కనిపించడంలేదని అన్నారు. విశాఖ జిల్లా ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ రుషికొండలోని ఎపిటిడిసి స్థలంలో ప్రభుత్వ నిర్మాణంపై ప్రశ్నించే పవన్‌కు ఎదురుగా గీతం యూనివర్సిటీలో చంద్రబాబు బంధువు భరత్ చేసిన 43 ఎకరాల భూ కబ్జా కనిపించలేదా అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో జరిగిన భూ ఆక్రమణలపై కనీసం నోరుమెదపకపోవడం దారుణమన్నారు. రుషికొండపై గతంలో ప్రభుత్వ రిసార్టులు ఉండేవని, అవి నేడు మరమ్మతుకు గురవడంతో అదే ప్రాంతంలో అధికారుల నిర్ణయంతో ప్రభుత్వం కొత్త భవన నిర్మాణం చేపడుతోందని అన్నారు. వీటి పక్కనే రామానాయుడు స్టూడియో, వెంకటేశ్వర స్వామి ఆలయం, ఐటి హిల్స్, వెల్‌నెస్ సెంటర్లు ఉన్నప్పటికీ పవన్ నోరెత్తడం లేదన్నారు. అన్ని అనుమతులతో నిర్మాణం జరిగితే పవన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. స్క్రిప్ట్ చదవడం, పక్క వాళ్లు చెప్పే మాటల ఆధారంగా ప్రసంగించడం పవన్‌కు అలవాటేనని ఎద్దేవా చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించకుండా వారాహి యాత్ర ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. 2019 ఎన్నికల సమయంలో తాను గెలిచినా, ఓడినా గాజువాకలోనే ఉంటానని చెప్పిన పవన్ ఈ నాలుగేళ్లు ఎక్కడికి వెళ్లారో ప్రజలకు సమాధానం చెప్పాని డిమాండ్ చేశారు. విస్సన్నపేటలో తన పేరిట 600 ఎకరాల భూమి ఉన్నట్టు పవన్ నిరూపిస్తే ఈ ప్రెస్‌మీట్‌కు వచ్చిన ఒక్కో విలేకరికీ ఒక్కో ఎకరం ఇస్తానని, ఇంకా మిగిలితే ఆ భూమిని జనసేన పార్టీకి రాసిస్తానని అన్నారు.

పవన్ అబద్ధాలకోరు

- విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సిబిసిఎన్‌సి స్థలంలో తమ సంస్థ ఎంవివి బిల్డర్స్ చేపట్టిన నిర్మాణాలపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదని, అక్కడ ఉన్న 1800 గజాల స్థలాన్ని తాను అన్యాక్రాంతం చేశానని అసత్య ప్రచారానికి దిగడం దుర్మార్గమని విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖ జిల్లా లాసన్స్ బే కాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. హెగ్డే అనే వ్యక్తి దగ్గర స్థలాన్ని తీసుకుని తమ సంస్థ డెవలప్ చేస్తోందని, ఈ స్థలం పూర్తిగా ప్రయివేటుదని, చర్చిది కాదని వివరణ ఇచ్చారు. రెండు నెలల క్రితం తన కుటుంబం కిడ్నాప్‌కు గురైన ఉదంతంపై అప్పుడే వివరణ ఇచ్చానని, దానిని కావాలని పవన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖపట్నంపై అంత ప్రేమే ఉంటే కార్యనిర్వాహక రాజధానికి పవన్ మద్దతు తెలిపి అభివృద్ధికి సహకరించాలన్నారు. విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్‌పై ఆయనకు కనీసం అవగాహన లేదన్నారు. గాజువాక ప్రజలపై ప్రేమ ఉంటే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటివరకూ ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. తనను రాజీనామా చేయమనే అధికారం పవన్‌కు లేదని, రానున్న ఎన్నికల్లో తనపై పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. తాను 25 ఏళ్లుగా విశాఖలో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నానని, పవన్ సినిమాల్లో నటించి డబ్బులు తీసుకుంటున్నాడని, అది వ్యాపారం కాదా? అని ప్రశ్నించారు. పవన్‌కు నిజంగా సత్తా ఉంటే అన్ని స్థానాల్లో పోటీ చేయాలన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు

మతతత్వ దాడుల బాధితులకు సిపిఎం ఆసరా

న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సమయంలో ఈశాన్య ఢిల్లీలో సంఘ్ పరివార్ గూండాలు మత ఘర్షణలు సృష్టించి మైనార్టీలపై దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. నాటి దాడిలో సర్వం కోల్పోయిన ముస్లింలకు సిపిఎం అండగా నిలిచి ఆర్థిక చేయూతనందించింది. బతుకు దెరువు కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేయడం, తోపుడు బళ్లు అందజేయడంతో పాటు వారి పిల్లల చదువుల కోసం ఉపకార వేతనాలు కూడా అందిస్తోంది. సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 11వ విడత ఉపకార వేతనాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఎం తివారీ, నాయకులు ఆశా శర్మ, రాజీవ్ కన్వర్, అమన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ప్రధాని మౌనం కుట్రలో భాగమే

- సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం

ప్రజాశక్తి - ఒంగోలు

మణిపూర్ ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం కుట్రలో భాగమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం విమర్శించారు. సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల యలమందరెడ్డి శత జయంతి వేడుకలను ఒంగోలులోని బచ్చల బాలయ్య కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బినయ్ విశ్వం మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న అరాచకాలపై అటు పార్లమెంట్‌లో, ఇటు పార్లమెంటు బయట ప్రతిపక్షాలు ప్రశ్నిస్తుంటే ప్రధాని సమాధానం చెప్పకుండా అల్లర్లను ప్రోత్సహించేలా ప్రవర్తిస్తున్నారన్నారు. గతంలో గుజరాత్ అల్లర్ల సందర్భంగా అల్లరి మూకలకు ప్రభుత్వం అన్ని విధాలా మద్దతుగా నిలిచిందన్నారు. అదే విధంగా నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆ రాష్ట్రంలోని అదే ప్రభుత్వం మణిపూర్ అల్లర్ల మూకకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పట్ల బిజెపికి ఏ మాత్రం గౌరవం లేదని మండిపడ్డారు. బిజెపి నాటిన కులం, మతం అనే విషవిత్తనాలు.. తిరిగి ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చినా తొలగించేందుకు మరో 15 సంవత్సరాలు పాటు సమయం పడుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం పరిరక్షణ కోసం ప్రతిపక్షంలోని అన్ని రాజకీయపార్టీలూ ఐక్యంగా పోరాటం చేయవల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బిజెపి ఆగడాలకు దేశంలోని ప్రతి ఒక్కరూ అడ్డుకట్ట వేసి దేశం నుంచి బిజెపిని తరిమికొట్టాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్నీ, లౌకికతత్వాన్ని అపహస్యం చేస్తూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలన సాగిస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలోని ప్రతి పౌరుడు నిరసన తెలపాలని కోరారు. ప్రముఖ ఆర్థిక రాజకీయ నిపుణులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశం ఆర్థికంగా, రాజకీయంగా సంక్షోభంలో ఉందన్నారు. ఈ సంక్షోభం నుండి బయట పడేందుకు దేశంలోని ప్రతి ఒక్క పౌరుడూ పోరాడాలని కోరారు. సమావేశంలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, గుజ్జుల యలమందరెడ్డి కుమారులు డాక్టర్ గుజ్జుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు

'టైమ్‌స్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 1993 ముందు నుంచి టైమ్‌స్కేల్‌లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, దినసరి వేతనం, ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ కంటెన్‌జెంట్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంఆర్, మినిమం టైమ్‌స్కేల్, కన్సాలిడియేట్, ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్, కంటెంజెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం బాలోత్సవ్ భవన్‌లో జెఎసి నాయకులు బి సురేష్, కె శ్రీనివాస్, కెవి రవిశంకర్ మీడియాతో మాట్లాడారు. టైమ్‌స్కేల్ సిబ్బంది విషయంలో ప్రభుత్వ తీరు సరైందికాదన్నారు. టైమ్‌స్కేల్ వ్యవస్థ ప్రభుత్వశాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానం కంటే ముందు నుంచి వుందని అన్నారు. తమ సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లు టైమ్‌స్కేల్ ఉద్యోగులనూ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో టైమ్‌స్కేల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసినట్లుగా రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలను కలిసి మద్దతు కూడగడతామని తెలిపారు. ఈ నెల 18న అన్ని కలెక్టరేట్ల ముందు 'ముఖ్యమంత్రి గారు మాకు అన్యాయం చేయొద్దు' అనే నిరసన కార్యక్రమంతోపాటు కలెక్టరుకు వినతిపత్రాలు అందజేస్తామని అన్నారు. అలాగే ఈ నెల 25న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

ఉక్కు ప్రయివేటీకరణపై సిఎం స్పందించాలి

- వారాహి విజయయాత్ర సభలో పవన్ కల్యాణ్



విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు ప్లకార్డును చూపుతూ మాట్లాడుతున్న పవన్

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి స్పందించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వారాహి విజయయాత్ర ఆదివారం విశాఖపట్నం గాజువాకలో సాగింది. ఈ సందర్భంగా పాత గాజువాక జంక్షన్‌లో సాయంత్రం జరిగిన సభలో పవన్ మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో సాధించిన స్టీల్‌ప్లాంట్ ఆంధ్రులకు గుండెకాయ వంటిదని అన్నారు. నాడు ప్లాంట్ కోసం తమ భూములను కారుచౌకగా ఇచ్చిన నిర్వాసితులు నేడు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 151 మంది ఎమ్మెల్యేలున్న జగన్ ప్రభుత్వం ఉక్కు ప్రయివేటీకరణ విషయంపై మాట్లాడటం లేదన్నారు. తాను మాత్రం అమిత్‌షాతో మాట్లాడానని, నష్టాల్లో ఉన్నప్పటికీ సొంత గనులు కేటాయించి ఆదుకోవాలని కోరానని చెప్పారు. తాను మాట్లాడినట్టుగా కూడా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడకపోవడం వల్ల సమస్య పరిష్కారం కాలేదన్నారు. తన పార్టీకి ఒక ఎంపి అయినా ఉండుంటే చట్టసభల్లో గొంతు వినిపించేవారిమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో విశాఖ ఉక్కు కర్మాగారం కీలకపాత్ర పోషించిందని తెలిపారు. గతంతో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రయివేటీకరణపై తాను సిపిఎం, సిపిఐతో కలిసి పోరాటం చేశానని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్ విషయంలోనూ అందరం కలిసి ఉద్యమం నిర్వహించాలన్నారు. 30 మంది ఎంపిలు ఉన్నప్పటికీ వైసిపి ప్రభుత్వం ఉక్కు ప్లాంట్‌పై మౌనంగా ఉండటం దారుణమన్నారు. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ పోర్టులో 10 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా ఏమైందని ప్రశ్నించారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌ను తాకట్టు పెట్టారని విమర్శించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గంగవరం ప్రాంత మత్స్యకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. జగన్ ఎప్పుడు చూసినా విశాఖ రాజధాని అంటాడని, తొలుత గంగవరం మత్స్యకారుల, పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలన్నారు. ఎయులో పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయన్నారు. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులను జగన్ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. దసపల్లా భూముల్లోనూ స్కాం జరిగిందని ఆరోపించారు. గ్రామ పంచాయతీల నిధులను జగన్ సర్కారు కాజేయడం దారుణమన్నారు. కేంద్రంతో పోరాటం చేసే దమ్ము వైసిపికి లేదని తెలిపారు. 2024లో గాజువాకలో జనసేన జెండా ఎగురుతుందని జోస్యం చెప్పారు. రెండేళ్లలో విశాఖలో ఇల్లు నిర్మించుకుంటానని అన్నారు. విశాఖ ఎంపి ఒక రౌడీషీటర్ అని, సిరిపురం సమీపంలో ఆయన నిర్మిస్తున్న అపార్టుమెంట్లను ఎవరూ కొనుగోలు చేయరాదని కోరారు. ఒకవేళ ఎవరైనా కొనుగోలు చేస్తే జనసేన అధికారంలోకి వచ్చాక వెంటనే కూల్చివేస్తామన్నారు. జగన్ సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని చెప్పారు.

107, 108 జిఒలను ఉపసంహరించాలి

- కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - నిడదవోలు (తూర్పుగోదావరి)

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కేటగిరీకి చెందిన మెడికల్ సీట్లను పెత్తందారులకు దోచిపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జిఒలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో కెవిపిఎస్, సిఐటియు నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు న్యాయం చేయాలని, 107, 108 జిఒలను రద్దు చేయాలని నినదిం చారు. ఆ జిఒ కాపీలను చించివేసి నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడారు. మెడికల్ సీట్ల విషయంలో ప్రభుత్వ తీసుకొచ్చిన జిఒల కారణంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగు తుందన్నారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్, ఎన్ఆర్ఐ అనే రెండు కేటగిరీలను తెచ్చి వాటికి 50శాతం సీట్లు కేటాయించిందని, వీటికి రిజర్వేషన్లు వర్తించవని జిఒలో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందన్నారు. సగం మెడికల్ సీట్లను ధనిక విద్యార్థులకు అధికారికంగా కేటాయించిందని విమర్శించారు. ఫలితంగా రిజర్వేషన్ల విద్యార్థులు సీట్లను కోల్పోతారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు వైద్య విద్యను ప్రభుత్వమే దూరం చేస్తుందని మండి పడ్డారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.సుందర బాబు మాట్లాడుతూ.. బిజెపి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తుచ తప్పకుండా అమలు చేస్తుందనడా నికి ఇదొక ఉదాహరణ అని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను ఉన్నత చదువుల కు మనువాద, మతోన్మాద శక్తులు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, సిఐటియు నాయకులు గంటి కృష్ణ, డానియేల్, ఉస్మాన్, యర్రా శ్రీనివాస్, దుర్గారావు, రసూల్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

- అల్లూరి జిల్లాలో వేర్వేరుచోట్ల ముగ్గురు మృతి

ప్రజాశక్తి - మోతుగూడెం, మారేడుమిల్లి (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక ప్రాంతాలను చూసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆదివారం వేర్వేరుచోట్ల ప్రమాదవశాత్తు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన కాజా హేమంత్ (24) హైదరాబాద్‌లోని టిసిఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల సొంతూరు రాజమండ్రికి వచ్చారు. అక్కడ నుంచి 14 మంది స్నేహితులతో కలిసి విహారయాత్ర కోసమని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరు జలపాతానికి వచ్చారు. తోటి స్నేహితులతో సందడిగా గడుపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జలపాతంలో పడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు తన సిబ్బందితో వచ్చి జలపాతం నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఆసుపత్రికి తరలిం చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన కె.తేజస్ వర్మ (35), ఎమ్.సురేష్ (40) స్నేహితులతో కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం వాలమూరు (పాములేరు) వాగు వద్ద సరదాగా గడిపేందుకు వచ్చారు. ఈత కొడుతున్న క్రమంలో వాగు ఉధృతికి వారిద్దరూ కొట్టుకుపోయారు. తోటి స్నేహితులు వారిని బయటికి తీసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



రాజధాని రైతుల భేటిలో మాట్లాడుతున్న లోకేష్

మూడేళ్లలో అమరావతి నిర్మాణం : లోకేష్

యువగళంలో ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి రాగానే మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం గుంటూరు జిల్లా మేడికొండూరు, తాడికొండ మండలాల్లో కొనసాగింది. రావెలలో 'అమరావతి ఆక్రందన' పేరుతో రాజధాని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. లోకేష్ మాట్లాడుతూ విధ్వంసకర విధానాలతో రూ.5 కోట్ల మంది భవిష్యత్తును జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేశారని విమర్శించారు. అమరావతి రాజధాని సమస్య భూములు ఇచ్చిన రైతులకే పరిమితం కాదని, యావత్ రాష్ట్ర ప్రజలు తమ భవిష్యత్తు సమస్యగా చూడాలని అన్నారు. అధికారంలోకి రాగానే మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతి నిర్మాణం చేపడతామని, రైతులకు చెల్లించాల్సిన కౌలు బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అమరావతి రైతులను వేధించిన ఏ ఒక్కరినీ వదలబోమని, వారిపై జ్యుడీషియల్ విచారణ జరిపించి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, అవసరమైతే కటకటాల వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా మహిళా రైతులు మాట్లాడుతూ 'గత నాలుగేళ్లుగా తాము ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నాం. అమరావతి ఉద్యమంలో ఎన్నో కష్టనష్టాలను చవిచూశాం. దుర్గగుడికి వెళితే పోలీసులు అడ్డుకుని కొట్టారు. బూటు కాళ్లతో తన్నారు. మేం ఏమైనా దొంగలమా? రాజధానికి భూములు ఇవ్వడం మేము చేసిన నేరమా?' అని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమానికి వైసిపి నుంచి సస్పెండ్ అయిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కుటుంబ సమేతంగా లోకేష్ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకులు తనను బెదిరిస్తున్నారని తెలిపారు. తాను కష్టకాలంలో ఉండగా లోకేష్, చంద్రబాబు నాయుడు కొండంత ధైర్యం ఇచ్చారన్నారు. అమరావతి రాజధానికి తన సంపూర్ణ మద్దతు తెలిపారు.



థామస్‌కు ఘనస్వాగతం

తిరువనంతపురం : కేరళలో పుతుప్పళ్లి అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో సిపిఎం తరపున పోటీ చేస్తున్న విద్యార్థి, యుజనోద్యమాల నేత జైక్ సి థామస్‌కు ఆదివారం స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ మృతితో ఈ స్థానంలో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న సంగతి విదితమే.

సమీక్షలు సరే.. ప్రొటోకాల్ బడ్జెట్‌కు నిధులేవి?

- మానసిక, ఆర్థిక ఒత్తిడుల్లో రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వారం వారం సమీక్షలు చేసేందుకు చూపుతున్న శ్రద్ధ ఉద్యోగులకు కావాల్సిన నిధులు, మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించడంలో చూపితే బాగుండేదని, అలా కాకుండా నిధులు విడుదల విషయంలో నాన్చివేత ధోరణి అవలంభిస్తున్నారనే విమర్శ ఉద్యోగ వర్గాల నుంచి బలంగా వినబడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నూతన జిల్లాలు ఏర్పాటైన నేపథ్యంలో మండల స్థాయిలో నూతనంగా డివిజన్, తహశీల్దారు కార్యాలయాలు పెరిగాయి. ఆయా కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉద్యోగులపై పనిభారం పెరిగింది. దీంతోపాటు నిధులు కేటాయించకపోవడంతో తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఒక్కో తహశీల్దారు కార్యాలయానికి అద్దె వాహనాలకు గతంలో నెలకు రూ.35 వేలు చెల్లిస్తుంటే ప్రస్తుతం కేవలం రూ.10 వేల నుంచి రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని రెవెన్యూ సంఘాలు విమర్శిస్తున్నాయి. అలాగే మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు జిల్లాలకు వచ్చిన నేపథ్యంలో ప్రొటోకాల్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని, ప్రొటోకాల్ బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఓటర్ల నమోదు, సవరణ, తొలగింపులు కార్యక్రమాలు జరుగుతున్నా ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని రెవెన్యూ సంఘాలు పేర్కొంటున్నాయి.

చిరుద్యోగులపై ఆర్థిక ఇబ్బందులు

జిల్లా, మండల స్థాయి పర్యటనలకు విఐపి, వివిఐపి, ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో అయ్యే ఖర్చుకు సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. ప్రొటోకాల్ కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక ఆర్థిక ఒత్తిడి తట్టుకోలేక చిరు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రొటోకాల్ బడ్జెట్ కింద నిధులు కేటాయించాలి.

బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు


రీ సర్వే నిర్వహణ ఖర్చు ఇవ్వాలి

భూముల రీసర్వేలో భాగంగా సర్వే రాళ్లు నాటుతున్న వాటికి నిధులు రావడం లేదు. రీసర్వే నిర్వహణకు ఖర్చు చేసిన నిధులను ప్రభుత్వం తిరిగి రెవెన్యూ ఉద్యోగులకు ఇవ్వాలి. ఓటర్ల జాబితా సవరణలు, బిఎల్ఒల ఇంటింటి ఓటర్ల సర్వే, ప్రత్యేక ఓటర్ల నమోదు, ఓటర్ల అవగాహన సదస్సులు చేపడుతున్న ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు.

కె ఆంజనేయకుమార్ (చంటి), ఎపి విఆర్ఒ అసోసియేషన్ అధ్యక్షులు



"వృద్ధ జగత్సమాధిపై సమధర్మం
ప్రభవించును
నిద్దుర చీకటి వెలుపల వేకువ
మెలకువ పుట్టును .."
- ఆవంత్స సోమసుందర్



మౌనమేలనోయీ ...

కాసిన్ని అక్షరాలైనా కూడగట్టుకుని
ఆయుధాలై నిప్పుకణికల్ని విరజిమ్మాలి
కాసిన్ని గొంతులైనా నినాదాలై
దిక్కులు ప్రతిధ్వనులై పిక్కటిల్లాలి
కాసిన్ని పాదాలైనా లాంగ్‌మార్చ్ చేసి
పదఘట్టనల ఫిరంగులై హోరెత్తించాలి
కాసిన్ని సంఘీభావాల సానుభూతులు
ఇంటింటా నిరసన పళ్ళాలై మోగాలి
మౌనమేలనోయీ ...

అది–
రాజకీయమైతే దానికో హద్దుండాలి
మతజ్వాలలైతే లౌకికతత్వం అద్దాలి
డ్రగ్స్ మాఫియా దురంతమైతే తుదముట్టించాలి
సంపద్వంత ఖనిజాలై పసిడి రాశులైతే రక్షించుకోవాలి
జాతిహననాలు విద్వేషపూరిత అసహనాలు
సమైక్యతా రాగాల గొంతుల్ని నులుముతాయి
మౌనమేలనోయీ ...

నిశ్శబ్దం పెను శబ్దమై
మైదానాలూ లోయలూ
కొండల్ని నుసి చేస్తున్నాయి
ధనమాన ప్రాణాల్ని హరిస్తున్నాయి
ఏదో ఒకటి చేయి... సమయం మీరకుండా
మణిపూరు– దేశం కంఠాన మణిహారమై వెలగాలి
మౌనమేలనోయీ...

– దాట్ల దేవదానం రాజు
94401 05987



నగ్నపాదాల కింద ...

'ఒంటి మీద గుడ్డలతో
జెండాలు కుట్టించి
వివస్త్రవై ఊరేగుతున్న ధైర్యంనీది' అన్న
దిగంబర కవి వాక్యాన్నే
ఇపుడీ మణిపురి నేల మీద
వివస్త్రలై ఊరేగించిన ఆ తల్లుల ఒంటిమీద
నిండుగా కప్పుతున్నాను.

క్షమించండి ..!
నేను ఇప్పుడు అస్త్ర సన్యాసిని ...
వాక్యం గుండె లోతుల్లో కొట్టుకుని సుళ్ళు తిరిగి
ఊపిరాడక బయటకు రావటంలేదు ...
లేదంటే ...
ఈ అమానవీయ అఘోర తనాల చీకటి తెరల్ని
సూదంటి కత్తి మొనతో చీల్చి చెండాడేవాడ్ని
నా నిరాయుధతనంతో నేనిలా కూలబడిపోయాను

దేశమా వర్ధిల్లు ...
వొళ్ళంతా కళ్ళు చేసుకుని టీవీ తెరల మీద
టచ్‌స్క్రీన్ మీద పదే పదే మార్చి చూస్తూ మూర్ఛరోగివై పో...

వర్ధమాన సినీ హీరోకు పూలజల్లుల వాన కురిపించినట్టు
వాళ్ళనలా గుడ్డల్లేనితనంతో వీధుల్లో ఊరేగించారేగాని
ఒక్కడూ ఆకాశపు తాను గుడ్డను చింపి
వాళ్ళ ఒంటి మీద కప్పలేని
మీ వదరబోతుతనానికి
వర్తమానం సిగ్గుతో చచ్చిపోయింది!

అవును కదా !
దేహి అని వచ్చి
అన్నం పెట్టమన్న నోటితోనే వివస్త్రగా వడ్డించమన్న
గొప్ప పురాణ పురుషుల వారసులు కదా మీరు!
వావివరసలు మీకెందుకుంటాయి
అమ్మంటే పాలిచ్చే జంతువు కాదని
అస్థి రక్త మాంసాల ప్రయోగశాలని
మీకు ఏలా చెప్పాలా?
ఆవును దేవతను చేసి
అమ్మను వివస్త్రను చేసే
మను సంస్కృతిని మీ రక్త నాళాల్లో నింపుకుని
తల్లి భారతీ వందనమని వల్లె వేసే
మీ నంగనాచి పాచి పాటల్లో
ఎంత బూతును దాచుకున్నార్రా?
ఇక .....
మీ మదమెక్కిన శరీరాల్ని
జరాసంధుడి శరీరాన్ని
రెండుగా చీల్చినట్టు చీల్చి
నేలకొరిగి పోతున్న మానవీయ విలువలకు
బోటుగా నిలబెడతాను

అమ్మా! మణిపురీ మహిళల్లారా!
మీరు మరో యుద్ధానికి సన్నద్ధం కావాలి
పుట్ట తేనెలాంటి మీ జీవితాలను దోచుకునే
స్వదేశీ సామ్రాజ్యవాద విష కీటకమూకను
మీ నగ్న పాదాలతో నిర్దాక్షిణ్యంగా తొక్కి పాతరేయాలి!

– డా.కుంచే నాగ సత్యనారాయణ
91107 20774

ఇది నా స్వాతంత్ర్యమే!

అవును ఇది నా స్వాతంత్ర్యమే
బ్యాంకుల్లో అప్పులు కుప్పలు చేసి
ఐపీలతో ఆస్తులు పేరెసి చేరేసుకునే
పెద్దలకు 'రైటాఫ్' సిత్రాల సత్కారాలతో
వందనం చేసే ఇది నా స్వాతంత్ర్యమే!


కష్టాన్ని నమ్మి ఇచ్చే జీతం, కూలీతో
సంపద పెంచే జాతి ఫల వృక్షాలకు
జీతాల కోత, ధరల పెంపు, పన్ను మోత
విద్యుత్ షాక్ లతో కూల్చివేసే దేశం
అవునవును ఇదీ నా స్వాతంత్ర్యమే!

సంపద, సంపన్నుల మెరుపులు ఎగరేసి
ఆకాశానికి నక్షత్రాలై ఎగిరే తీరు చూపి
అగ్ర రాజ్యాల పక్కన ఎదిగిన
రాజ్యంగా చూపడంపై సిగ్గెందుకూ
ఇది కూడా నా స్వాతంత్ర్యమే!

కష్టజీవి నష్టజీవిగా భ్రష్టజీవిగా మిగిలినా
పేదరికంలో చీకి చితికే ఉరితాళ్ళతో ఉన్నా
జెండా తాళ్ళను పెనవేస్తూనే ఉన్నాడు
రేపు బోలో స్వాతంత్ర్య భారతికి జై అనాలిగా!
ఏళ్ళకేళ్ళు అంటున్న ఇదే నా స్వాతంత్ర్యం!

– ఉన్నం వెంకటేశ్వర్లు

విస్తృత చరిత్రను వివరించే 'వీర కళింగం'



"...ఇహం పరం అంటూ ప్రత్యేకంగా ఉండవు. ఈ సృష్టిలో ఉన్న ప్రతీ పదార్థం మార్పుకి లోనవుతుంది. ఏ వస్తువులోనూ నిత్యమూ, శాశ్వతమైన పదార్థం వుండదు" ఇది కళింగనేలలో వందలేళ్ల కిందటి తాత్త్వికధార. వైదిక తాత్త్వికతను విమర్శించిన ధార. "... కళింగుల జీవన విధానం మిగిలిన ప్రాంతాల జీవన విధానం కంటే భిన్నమైనది. మంచివారిగా బతకాలనుకున్నారే తప్పా, అందుకు ప్రతిఫలంగా స్వర్గాన్ని ఆశించలేదు. దొరికినదో, ఉత్పత్తి చేసినదో తోటివారితో పంచుకున్నారు. పనులు విభజించుకొని, ఎవరి పని వారు చేసుకుంటూ సమష్టిగా ప్రయోజనం పొందారే తప్పా, వృత్తుల మధ్య తేడాలు పాటించలేదు. ఈ క్షణంలో యీ భూమి మీద జరిగే కార్యానికి కారణం యిక్కడే వెతికారు తప్పా, పూర్వజన్మలకి ముడిపెట్టలేదు. ఈ ప్రకృతి సంపదను ఎన్నడూ స్వంత ఆస్తిగా భావించలేదు. సత్రంలో బాటసారిలా జీవించేరు, వెళ్లిపోతూ సమాజానికి అప్పజెప్పారు." ఓ ఆదర్శ పూర్వక జీవన తాత్త్వికత గల కళింగప్రాంతం గురించి యిలాంటి వాక్యాలు యింతకుముందు చదివిలేము! అగస్త్యుని రాకతో ఆరంభమైన వైదిక భావజాల దండయాత్ర ఆపస్తభునితో పూర్తయింది. వేద కేంద్రాలు, స్థావరాలు, యజ్ఞవాటికలు తదితరాలు నెలకొల్పి, కేవలం భూమండలాన్నే కాదు, మానవ జ్ఞాన మండలాన్ని కూడా గుప్పిట పెట్టుకున్నారు. 'ఉపనిషత్తులలో తాత్త్విక అన్వేషణ, తార్కిక జిజ్ఞాస వుండొచ్చు. పరిమళభరితమైన పుష్పం వెనుక ముళ్ల దాక్కున్నట్టు ఆత్మ, బ్రహ్మ అనే రెండు పదాలతో మానవ మస్తిష్కం ఊబిలో కూరుకుపోవడానికి, మానవచైతన్యం చతికిలబడిపోవడానికి మిథ్యావాదం దాగివుంది' ఈ విశ్లేషణ కూడా విని వుండము.

జైన, బౌద్ధ, వైదిక భావధారలను చర్చిస్తూ... యింకోవేపు రాచరిక పాలన చరిత్రను వివరిస్తూ – (కురుక్షేత్ర యుద్ధంలో కళింగులు కౌరవుల తరపున పోరాడడం, సుయోధనుని భార్య భానుమతి కళింగ ఆడపడుచు వంటి కొన్ని చారిత్రక అంశాలను వివరించటం) ప్రఖ్యాత చక్రవర్తి కళింగమ్మీద దండెత్తి, సంపద్వంత కళింగాన్ని శ్మశాన సదృశ్యం చేసి, వైరాగ్యం పొంది ... బౌద్ధం స్వీకరించి, బౌద్ధ ధర్మానికి జీవితాన్ని అంకితం చేసి, వృద్ధాప్యంలో మరణించినదాకా – కళింగనేల జన జీవనాన్నీ, కళింగనేల ప్రకృతి సంపదలనీ ... పరాయి నేలల నేతల దాడుల నుంచి యెదుర్కున్న వీరోచిత కళింగాన్నీ... దీర్ఘాసి విజయభాస్కర్ గారు ఈ నవలలో దృశ్యమానం చేసారు.

'గణతంత్ర నిర్వహణలో జంబూద్వీపానికే తలమానికం కళింగం. ధైర్యసాహసాలు ఉట్టిపడే సేనల కళింగం. అటవీ సంపదలకు నిలయ కళింగం. తార్కిక ఆలోచనా, తాత్త్విక చింతనతో మదించిన మత్తేభం కళింగం..." ఇలాంటి వాక్యాలెన్నో ఈ నవలలో! నాటి కళింగ ఘనతకు అద్దం పట్టిన వాక్యాలివి. 'చారువాకీ! నేను చక్రవర్తినే కదా?" అశోక చక్రవర్తి ప్రశ్న

కారువాకి యేమీ బదులివ్వదు. (కళింగ ఆడపడుచు కారువాకి. ప్రేమ పేరుతో ఆమెను తన రాజ్యానికి తీసుకుపోతాడు. ఆమె పట్ల ప్రేమ కలవాడు. ప్రేమగా చారువాకీ అని పిలుస్తుంటాడుట) అశోకచక్రవర్తి రొక్కించుతాడు. అప్పుడు బదులిస్తుంది : "... మీరు చక్రవర్తి కారు... కానీ అయ్యారు..." అని. అర్థం కాదు అశోకునికి. 'అంటే?' అని ప్రశ్నిస్తాడు. కళింగుల మాటల్లో శ్లేష, వ్యంగ్యం ఆనాటిదే, విజయభాస్కర్ గారు భలేగా రాసేరు.

'శత సోదర హతం – సింహాసనం హస్తగతం' అనంటుంది. కారువాకి తన కళింగనేల పట్ల గల ప్రేమకు, ఆరాధనకూ, కళింగ ప్రజల వీరోచిత తత్త్వానికీ అద్భుత అక్షరరూపం అశోకుడు కళింగమ్మీదకు దండయాత్రకు వెళ్తానన్నప్పటి సన్నివేశం. అశోకుడు తొలిసారి కారువాకిని మత్స్యలేశం వద్ద కలసినపుడు, కారువాకి చేతిలో పదునైన ముళ్ల కలిగిన ఎండిన చేప బుర్ర వుంటుంది. అది ఆటవస్తువు కాదు, వేట వస్తువు అంటారు రచయిత! ఇంతకీ కళింగమ్మీద అశోకుడెందుకు దండయాత్ర చేయదలచుకున్నాడు? అంతకుముందర అశోకుని తండ్రి చేయాలనుకొని చేయలేకపోవడాన్ని, అనేక చక్రవర్తులు కళింగాన్ని జయించలేకపోవడాన్నీ నవలలో ముందరి పేజీల్లో చదువుతూ వచ్చిన పాఠకునికి యీ సన్నివేశంలో అశోకుడు చెప్పిన కారణాలతో మొత్తం దండయాత్రల (అది రాజులదో, మతవాదులదో) కీలకం అర్థమవుతుంది.

'చారువాకీ! మా అన్వేషకులు, పరిశోధకులు యాత్రికుల రూపంలో కళింగుల గురించి తెలుసుకున్న విశేషాలు వింటుంటే ఒళ్లు గగుర్పొడుస్తోంది. (చదువుతుంటే పాఠకునికీ గగుర్పొడుస్తుంది) సియామ్‌కి పూర్వం పేరేమిటో తెలుసా.. కళింగ రాష్ట్రం. అది అనేకులకు ఆకర్షణీయమైనది. ఏనుగులు, వాటి దంతాలు, మయూరాలు, పులికూనలు, సుగంధ ద్రవ్యాలు, సన్నని వస్త్రాలు, సున్నితమైన గాజు వస్తువులు, అలంకార ప్రతిమలు వగైరాల ఎగుమతులతో సుభిక్షంగా వుంది. అలాగే ఆ నేలలోకి వైదికం ఒకవేపు ప్రవేశిస్తోంది. అది బలపడకముందే, ఇతర రాజ్యాలు లోబరుచుకోకముందే మేము కళింగాన్ని మగధలో కలుపుకోవాలి. అందుకు యుద్ధమే శరణ్యం' అనంటాడు అశోకుడు. సరిగ్గా ఆనాటి అశోకుడి నుంచి ఈనాటి ఆల్ఖైమా వంటి కార్పొరేట్ శక్తులూ, పరప్రాంత పెట్టుబడి బలగాలూ కళింగమ్మీద ఈ కారణాలతోనే, సహజ వనరుల, సంపద్వంత సీమ అయినందునే దోచుకోవడానికి దారి కడుతున్నాయి. దండెత్తుతున్నాయి. అశోకుడి నాటి నుంచీ కళింగం సముద్రతీర వ్యాపార ప్రసిద్ధ కేంద్రం. అడవులూ, సారవంత మైదానాలూ... ఆరుగాలం కష్టించే బహుజన శ్రమజీవులూ నడయాడే నేల! అయిదు వందల కిలోమీటర్ల అటవీ ప్రాంతం. ఇక్కడ విలువైన వృక్ష సంపదే కాక, ఐదువందల రకాల ఔషధమొక్కలున్నాయి. ఖనిజాలున్నాయి. కష్టించే ఆదివాసులున్నారు. అడవినీ, ఖనిజాలను కొల్లగొట్టడానికి కార్పొరేట్ కంపెనీలు కాలుమోపుతున్నాయి ఇపుడు.

350 కిలోమీటర్ల సముద్రతీరముంది. వేలకోట్ల రూపాయల మత్స్యసంపద దొరుకుతుంది. తీరంలో యురేనియం వంటి విలువైన ఖనిజాలున్నాయి. పరప్రాంత పెట్టుబడి బలగాలు తీరం అంతటా హస్తాలు చాపుతున్నాయి. పాతిక లక్షల ఎకరాల పంటభూములున్నాయి. పద్దెనిమిది జీవనదులున్నాయి. అధిక వర్షపాత ప్రాంతమిది. అయిదొందల టీఎంసీల నీళ్ల లభ్యమవుతాయి. అయినా మూడోవంతు పంటభూమికి మాత్రమే సాగునీరు లభ్యమవుతుంది. ఆరంభించిన నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తిచేయరు. వ్యవసాయాధార పరిశ్రమలను మూసివేతకు గురిచేసి, కాలుష్య కారక, ప్రమాదభరిత పరిశ్రమలను ప్రవేశపెడతారు. ఏటా కళింగం నుంచి పొట్ట చేతను పట్టుకొని యేభయి వేలమంది పరప్రాంతాలకు వలస పోతున్నారు. విద్య, వైద్యం, రవాణా, ఉపాధి రంగాల్లో ఆఖరి ప్రాధాన్యతనిస్తాయి ప్రభుత్వాలు. చివరికి వెనుకబడిన ప్రాంతమనే ట్యాగ్ తగిలిస్తారు. నిజానికిది వెనుకబడిన ప్రాంతం కాదు, వెనుకబాటుకు గురి చేసిన ప్రాంతం.

చక్రవర్తుల నెదిరించిన స్వతంత్ర గణతంత్ర సీమ, తెల్లదొరతనమ్మీద పోరాడింది. జమీందారీలతోపోరాడింది. రైతు రక్షణయాత్ర చేసింది. రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపింది. నిన్న, మొన్నటి... సోంపేట, కాకరాపల్లిల్లో కార్పొరేట్లపై కాలుదువ్విన రాజకీయ రణధీర కళింగం. ఆధునిక కథ, నాటకం (గురజాడ) అందించింది. హరికథ (హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు) వినిపించింది. వయొలిన్ (ద్వారం వెంకటస్వామినాయుడు) వాయించింది, కవిత్వంతో మహాప్రస్థానం (శ్రీశ్రీ) చేయించింది. ప్రపంచ ప్రసిద్ధ మల్లయోధుడిని (కోడి రామ్మూర్తినాయుడు) ఇచ్చింది. ఎందులో వెనుకబడింది కళింగం? ఎవరి వలన వెనుకబాటుకి గురయ్యింది? ఎన్నాళ్లీ వెనుకబాటు? ఎన్నెన్నో ప్రశ్నలు, ఎన్నెన్నో వివక్షలు దీర్ఘాసి విజయభాస్కర్ గారిని వెన్నాడివుంటాయి. వేదనకూ, ఆగ్రహానికీ గురిచేసి వుంటాయి. వాటి ఫలితమే... ఈ గ్రంథం. ఇది కళింగనేల గత చరిత్ర. ఘన చరిత్ర. ఈ చరిత్రను శోధించి, నవలీకరించటం సాధారణ విషయం కాదు. విజయభాస్కర్ గారు చరిత్ర అనే ప్రవాహంలో ఈదులాడినారు. మునిగీ, తేలీ, అగాధమౌ కళింగ జలనిధిలోంచి 'వీరకళింగం' అనే ఆణిముత్యాన్ని తీసుకొచ్చేరు. వివక్షకు గురైన వర్తమాన కళింగ జనావళికి వీరఖడ్గాన్ని అందించేరు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రముఖ రచయిత, మేధావి, చినవీరభద్రుడు గారు అన్నట్టు – రానున్న రోజుల్లో కళింగాంధ్రలో ఒక నవ్య రాజకీయ, సామాజిక భవిష్యత్‌కు దారితీయగలదు. (వీరకళింగం నవల; పేజీలు : 260, వెల : రూ.200. అన్ని ముఖ్య పుస్తక విక్రయ కేంద్రాల్లో దొరుకుతుంది.)

– అట్టాడ అప్పల్నాయుడు

సారాంశ్

పోతే పోయింది యవ్వనం
జీవితం మైదానంలోకి ప్రవేశించింది
ఇప్పుడు హృదయం
అవికార శోభితం

పోతున్నప్పుడే కొంత తెలిసింది
ఇవాళ పూర్తిగా అంతర్థానమయ్యింది.

ఒకప్పుడు పొగరు దానికి చుట్టం
అతి విశ్వాసం అనుంగు నేస్తం
కాలర్ ఎగరేసే ఉడుకు రక్తం దాని సమస్తం

ఒక యువ కిశోరం
ముగ్గులా మలుపులు తిప్పుతూ
వాహనాన్ని పరిగెత్తించే దృశ్యం
మరొకడు వెడల్పైన కాల్వను
అవలీలగా దాటే సాహసం!

ఇదంతా బాగానే వుంది గాని
వృద్ధులను ముసలి వాళ్లు అని
ఈసడించే విడ్డూరం
చేతి కండలను ప్రదర్శిస్తూ
మురిసిపోయే విచిత్రం!

నిజమే
వయస్సే సగం సొగసు
అయితే వయసూ మనసూ
ఒక నిష్పత్తిలో ఎదగని అక్రమోన్మీలనం.

బలం పెరిగే క్రమంలో
సంస్కారం తగ్గటం ఒక వక్రగతి
అపరిణతి
అవగాహన లేని లోకరీతి.

యవ్వనం పోతే పోయింది గాని
గోరువెచ్చని రక్త చాలనంతో
ఇతరుల పట్ల
కొంచెం ప్రేమ కొంచెం దయ
కించిత్ త్యాగం మేల్కొన్నాయి
మానవత్వం గురించి
ఆలోచించే తీరిక దొరికింది!

పోతే పోయింది యవ్వనం
ఇప్పుడు ఇంటి నిండా
బహుళ సార్థక జీవితం
నిత్య సారాంశ గీతం
నో రిగ్రెట్స్!

– డాక్టర్ ఎన్.గోపి

పాఠకులను అప్రమత్తం చేసే కవి 'నిజం'

ఈ ప్రపంచంలో అనేకనేక సంఘర్షణలను, సంక్షోభాలను, పోరాటాలను, ఉద్యమాలను 50 ఏళ్లుగా అత్యంత దగ్గరగా పరిశీలించిన, పరిశీలిస్తున్న కవి, రచయిత, సీనియర్ సంపాదకుడు 'నిజం' పేరుతో ప్రాచుర్యం పొందిన గార శ్రీరామమూర్తి. ఈ కవి చుట్టూ ఒక వలయం ఉంటుంది. ఆ వలయంలో అణగారిన వర్గాలకు జరిగే అన్యాయం, ఆధిపత్య కులాల పెత్తనం, వ్యాపార శక్తుల కుట్రలు, మతం మాటున ఎగిసిపడే మంటలు, అమానవీయ సంఘటనలు ... ఇవన్నీ ఆయన్ని ఉక్కిరిబిక్కిరి చేసినప్పుడు ఆయన కలం రంగంలోకి దిగుతుంది. మౌనాన్ని భగ్నం చేస్తూ వెలుతురు వాక్యాలు ఉద్భవిస్తాయి. మనువాద కపట నాటకాలను తన కవిత్వ తెర మీద చూపుతూ, తెరలను భస్మం చేయాలనే చైతన్యపూరిత కర్తవ్యం కవిత్వీకరణగా కనిపిస్తుంది. గతి తార్కికత ఈ కవిత్వానికి సిలబస్. సమూహాన్ని ఎడ్యుకేట్ చేయడమే ఆయన పాఠం.



ఈ కవికి రెండు వైపులా కాదు అన్ని వైపులా పదును. ఒక వేటగాడు మృగాన్ని వేటాడే సందర్భంలో వుచ్చులు కడతాడు. ఎరలు వేస్తాడు. జాడలు కనిపెడతాడు. మాటు వేస్తాడు. వలలు పన్నుతాడు. కొన్ని సంకేతాలు పెట్టుకుంటాడు. ఈ కవి అలాంటి వ్యూహంతోనే ముందుకు వెళ్తాడు. కవిత రాస్తున్నప్పుడు నామవాచకం, విశేషాలను, క్రియను సంకేతాలుగా వాడతాడు. ఆ వాక్యాల వెంట పాఠకుడు నడుస్తున్నప్పుడు ఈ సంకేతాలను పట్టుకోవాలి. "తెల్లగడ్డం ముళ్ల చట్టాల మాంత్రికుడు చేసే కుపరిపాలన ముద్రిస్తున్న పాఠ్యగ్రంథాలు' అనడం ద్వారా ఈ కవి ఫాసిస్టు రాజ్య ప్రభావాన్ని, స్వభావాన్ని చెబుతాడు. మన చుట్టూ విధించిన రెక్కలను విదిలించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించమంటాడు. ఒక్కోచోట బహిరంగంగా చెప్తాడు. ఇంకోచోట సంకేత సూచన చేస్తాడు. డిస్టర్బ్ అయిన సమూహాన్ని లోపల పెట్టుకుని కుట్రలను భగ్నం చేయమంటున్నాడు. పూదోటలో సీసీ కెమెరా అనే కవిత నిర్మాణాన్ని పరిశీలిస్తే, ఎత్తుగడలో పువ్వుల్ని, మొగ్గల్ని, ఉద్యాన వనాల్లో ఉన్న పెళ్ళికాని జంటలను చూడడానికి కన్నొక్కటి ప్రత్యక్షమవుతుందని మొదలుపెట్టి ఒక సౌందర్యాత్మక వాతావరణాన్ని తీసుకొస్తారు. చివరికి వెళ్లేసరికి ప్రతి ఒక్కరి మనసులోనూ జైలొకటి లేచింది, లోపల బయట చిమ్మ చీకటి నిఘా ఉంది అని చెప్పి, సూర్యచంద్రులకు గూఢచర్య శిక్షణ ఇచ్చారు/ భూమ్యాకాశాలకు దొంగ కళ్లు, చెవులు అమర్చారు / పెగాసస్ కేసులో వీరు బొత్తిగా అమాయకులు. .. అంటాడు. ఈ ముగింపు పెగాసస్ అనే మూడు అక్షరాల దగ్గర కవి చెప్పదలుచుకున్న ఆంతర్యం అంతా దాగి ఉంది .

ఆయన కవితలు కొన్ని తలుపులు మూసుకుపోయినట్టుగా అనిపిస్తాయి. లోపలికి వెళ్తే మూసిన తలుపులకు సంబంధించి, తీయవలసిన తాళాలు కనిపిస్తాయి. ప్రాచీన అలంకారికుల్లో విశ్వేశ్వరుడు చమత్కార సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ కవిలో అప్పుడప్పుడు తొంగి చూసే చమత్కారం మనల్ని అలరిస్తుంది. అయితే అది తెచ్చి పెట్టుకున్న చమత్కారంగా అనిపించదు. ఆ వాక్యంలో ఆ పదంలో ఆ భావానికి చమత్కారం అవసరం అనుకుంటే కవి సహజంగా వాడినట్టే అనిపిస్తుంది. చమత్కారం కూడా అప్పుడప్పుడు సీరియస్‌గా సాగే భావ ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. అటువంటి ప్రమాదం ఈ కవిత్వంలో చాలా తక్కువగానే కనిపిస్తుంది. విరుద్ధాల్ని వాక్యంగా మలచడం కూడా ఈ కవికి ఉన్న ఒక బలం. కొన్ని సందర్భాల్లో భాష, అలంకార సౌందర్య సామగ్రి లేకుండా కూడా కవి వాక్యం నిర్మించాడు. ఏకకాలంలో హృదయాన్ని, మెదడుని కలగలిపి పాఠకుడిని ఆలోచింపజేసే సీరియస్ కవిత్వం వీరిది. ఒక పదునైన ఆలోచనతో, ప్రకంపనతో కూడిన ఉద్వేగంతో తర్కాన్ని కలిపి పాఠకుణ్ణి ఉక్కిరి బిక్కిరి చేసే శైలి శ్రీరామమూర్తిలో కనిపిస్తుంది. నాలుగోపాదంలో ఉన్న కళ్ళు కవిత ఆయన కవిత్వ నిర్మాణ సామర్థ్యానికి మచ్చుతునక కాదు; మెచ్చు తునక.

నాలుగో పాదం కవితా సంపుటిలో కవిత్వ నిర్మాణానికి, బూడిద చెట్ల పూలు కవితా సంపుట్లోనే కవిత్వ నిర్మాణానికి ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. నాలుగో పాదం కవితా సంపుటిలో పొడి పొడి వాక్యాలు నిర్మాణం కనిపిస్తుంది. ముగింపుకి వచ్చేసరికి కవిత మొత్తం చేయవలసిన భావ ప్రసారాన్ని చేస్తుంది. బూడిద చెట్ల పూలు కవిత సంకలనంలో నిర్మానుష్యం అనే కవిత నిర్మాణాన్ని చూసినప్పుడు సుదీర్ఘమైన వచనం ఉన్నప్పటికీ మనల్ని చదివింపజేస్తుంది. పక్కా వచనరూపంలో ఉన్నా వాడిన భాష కవిత్వ ప్రవాహాన్ని వేగవంతం చేసింది. దీన్ని తమాషాగా నేను పరుగుపందెం శైలి అంటాను. ఈ పందెంలో కవి, పాఠకుడు ఇద్దరూ గెలుపు మజాను అనుభవిస్తారు. ఈ రచనా సంవిధానం పై అప్రయత్నంగానే ఆయన పట్టు సాధించినట్టుగా అర్థమవుతుంది. పరుగుపందెం శైలికి ఒక ఉదాహరణ.

'మనం ఎప్పుడో ఒకప్పుడు విడిపోతాం/ చెట్ల ఆకుల్లా, పూలరెమ్మల రాలిపోతాం/ జాడ లేని అడుగులమైపోతాం/ అయినా ఎవరికి వారం సచ్చరిత్ర భవనానికి యిటుకలుగా / నిలిచిపోవాలనుకుంటాం/ వొకటొకటి కలిసి బిందు సింధువుల బాంధవ్యమై మనిషి మంది అయి/ చైతన్యమైతేనే తీపి పులుపుల ద్రాక్ష తోట కదా!'

బూడిద చెట్ల పూలు కవితా సంకలనంలో 'వేవేల నేల' కవితలో నిజం గారి ఆత్మ దొరుకుతుంది. విరామ చిహ్నం అనే పేరుతో ఓ కవిత ఉంటుంది అది ఆయన ఆత్మ గుండా సాగే ప్రాణం. మురుగు వాసన వేసే అక్షరాల పూలబుట్టకు, ఒళ్లంతా గాయాలై అనారోగ్యం పాలైన వాతావరణానికి చికిత్స చేసే పనిలో ఆయన 24 గంటలు కవిత్వం అయిపోవడం మామూలు విషయం కాదు. దినకూలి రోజు పనికి వెళ్తే తప్ప బతకలేనట్టు, ఈ కవిత రాస్తే తప్ప ఊపిరి పీల్చలేని తనంలో ఉన్నట్టు ఆయన కవిత్వం చదివితే స్పష్టంగా తెలిసిపోతుంది.

కూడిక అనే కవితలో ఆయన ఏమన్నాడో చూడండి.. : "వొక నువ్వు వొక నేను/ కొబ్బరికాయ దానిలో నీరు కాగలం/ జలమూ, జల పుష్పమై యీదగలం/ బండి, దాని చక్రమై పరాక్రమించగలం / వొక నువ్వు వొక నేను / చేదతాడై బావిని పారించగలం/ చేయి సమ్మెటై, కొలిమిని పనిముట్లను చేయగలం/ పొలాన్ని నిండు గోదాము గావించగలం/ యేకలింగ ప్రసవాలు ఒంటి చేతి చప్పట్లు / గాలిలేని కొమ్మల పూనకాలు / ద్రవం లేని ధారలు/ వొకే కుల వొకే మత జాతులే ప్రకృతి విరుద్ధాలు" ఈ కవితకి శీర్షికని చూడకపోతే కాస్త మనకు అర్థం కానట్టే ఉంటుంది. శీర్షిక చూశాక ఈ కవిత సారం మొత్తం బోధపడుతుంది.

ఆయనలోని మరో కోణానికి క్లుప్తతకు నిదర్శనంగా నిలిచేవి అలలు. విమానపు రెక్కలతో దూసుకుపోయే కాలంలో నాలుగే నాలుగు పాదాలతో రసనను సంతృప్తి పర్చడం చిన్న విషయం కాదు. ఇందులో ఆయన అడుగడుగునా ప్రకృతిని సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. అలలులో పదాలు ఆయన ఎలా చెబితే అలా ఉన్నాయి. రూపంలో పొట్టిగా ఉన్న ఇవి గట్టి కవితలు. ఇన్నేళ్లుగా కవిత్వం రాస్తున్న నిజం, కవిత్వం గురించి ఎక్కడైనా మాట్లాడారా? కవిత్వాన్ని ఆయన ఎలా చూస్తున్నారు? దీనికి సమాధానం అలలులో దొరికింది. "ఆకలితో అల్లాడిపోయే అక్షరాలకు భావాల పాలు తాగించి గంతులేయించడమే కవిత్వం." అన్నారు. మరోచోట– "మనసు ఊలుసంచిలో భద్రంగా దాచుకున్న/ చెకుముకి రాళు తడిసిపోయాయి, భావాగ్ని నిద్దరోతోంది." అన్నారు. "వాక్యాల నాగలి చాళ్లలో పండించే కవితలకు లోక రీతి జీవన తత్వాలే విత్తనాలు" అంటారు మరొకచోట. ఈ కింది ఈ అలని గమనించండి. ఆయన ఏమి కలగంటున్నాడో చాలా స్పష్టంగా కవిత్వీకరణ చేశాడు.

"నీటి పొరలను ఒకటొకటిగా విప్పి చూడు, తడి తడి తడి/ గాలి హృదయాన్ని కవం పట్టి చూడు శ్వాస శ్వాస శ్వాస / వెలుగును వెయ్యి సార్లు ఉతికి చూడు వికాసం వికాసం వికాసం / దేవుళ్ళది ఎప్పుడూ సంహారం సంహారం సంహారం / వినాశకులను ఆరాధించే జాతి విలిసిల్లదు. " ఈ వాక్యాల్లో ఆయన టోన్ గమనించండి. ఒక జాతి తాలూకు సంకుచితత్వాన్ని ఐదు వాక్యాల్లో విప్పేశారు. ఆయన పొట్టి వాక్యం రాసినా, పొడుగు వాక్యం రాసినా, ప్రోజ్ రాసినా, పోయెట్రీ రాసినా, నర్మగర్భంగా చెప్పినా, అధి వాస్తవికతను ఎంచుకున్నా ఆయన దృక్కోణం మాత్రం స్పష్టం. ఆధునిక సమాజంలోని వైచిత్రిని, వైరుధ్యాలను పూర్తిగా అర్థం చేసుకొని వాటిని అధిగమిస్తూ స్వేచ్ఛ సమానత్వం అనే సారం వైపు ఈ కవి నడుస్తూనే ఉన్నాడు. అయితే, ఏ కవీ పరిపూర్ణం కానట్టే అక్కడక్కడ మనకు ఈ కవితల్లో కూడా కొన్ని లోపాలు గమనించవచ్చు. సమాజంలో జరిగే అమానవీయ, అమానుష సంఘటనలకు కవిత్వం రాస్తున్నప్పుడు కవులు సాధారణీకరించి మాట్లాడటం, అందరికీ ఆపాదించడం సరైన పద్ధతి కాదని నా వ్యక్తిగత అభిప్రాయం. నాలుగో పాదం సంకలనంలో ఎడారి అనే కవిత ఉంటుంది. ఆ కవిత ముగింపు దగ్గరకు వచ్చేసరికి 'సమాజ బీజం మొలవని మంచి మచ్చుకైనా నిలవని చవుడు భూమి' అని ముగించారు. దీనికి నేను వ్యాఖ్యానం చేయను. ఇలాంటివి అక్కడక్కడ ఉన్నాయి. సమూహాన్ని సమాజాన్ని పూర్తిగా మార్చడం అనే ప్రాతిపదిక మీద నిజం కవిత్వం నిలబడి ఉంది. భాష మీద ఆయనకు అపారమైన పట్టు ఉందని కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇదే భాషా వ్యామోహం కొన్నిచోట్ల మనల్ని ఇబ్బంది కూడా పెడుతుంది. తన సాహిత్యాన్ని ఏ తాత్విక దృక్పథం నుంచి మొదలు పెట్టాడో, దాన్ని ఎక్కడ విడిచిపెట్టకుండా సాగుతూనే ఉన్నారు. పాలకవర్గాల భావజాలం పట్ల అడుగడుగునా పాఠకుడిని అప్రమత్తం చేస్తున్న కవి నిజం.

– డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

సాహిత్య విమర్శనా వ్యాసాలకు ఆహ్వానం

ప్రామాణికమైన విమర్శనా వ్యాసాలతో ఒక పుస్తకాన్ని ప్రచురించాలని 'పాలపిట్ట బుక్స్' సంస్థ సంకల్పించింది. 'సంశోధన' శీర్షికన క్ష్మాదీచీ నెంబర్‌తో ఈ వ్యాసాల పుస్తకం వెలువడుతుంది. సాహిత్య విమర్శ, పరిశోధనలలో ఉన్నతమైన విలువలతో కూడిన వ్యాసాల్ని పరిశోధకుల నించి, విమర్శకుల్నించి ఆహ్వానిస్తుంది. ఈ పుస్తకంలో అన్ని కొత్త వ్యాసాలు ఉంటాయి. అకాడమిక్ ప్రమాణాల్ని పాటిస్తూ వ్యాసాలు సమగ్రంగా, సరికొత్త ప్రతిపాదనలతో, విశ్లేషణలతో కూడినవై ఉండాలి. తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియల మీద రాయవచ్చు. వ్యాసంతో పాటు ఎంట్రీ ఫీజుగా రూ. 2000 పంపించాలి. మీ వ్యాసాలు పంపించాల్సిన చిరునామా : ఎడిటర్, పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నెం: 2, బ్లాక్–6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–500044. email: palapitta-books@gmail.com వ్యాసాలు పంపడానికి చివరి తేదీ : 24 ఆగస్టు 2023. అక్టోబర్ నెలలో కొడవటిగంటి కుటుంబరావు జయంతి సందర్భంగా ఈ పుస్తకం విడుదల అవుతుంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన మొబైల్ నెం : 98487 87284.

– గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట బుక్స్

15న దేవరాజు మహారాజుకు సప్తతి వేడుక

సాహితీ ప్రపంచంలో పరిచయం అక్కరలేని పేరు డా. దేవరాజు మహారాజు గారిది. వారి 'సప్తతి' వేడుక మానవ వికాస వేదిక నిర్వహిస్తుంది. ఆగస్టు 15, 2023 మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం కొండాపూర్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌లో జరగనుంది. మేధావులు వద్ధాప్యంలో సేద తీరే గొప్ప కేంద్రమది. అక్కడ ఉండే పెద్దలు నగరంలోని వివిధ కార్యక్రమాలకు హాజరుకాలేక పోవచ్చు కనుక, అక్కడే, వారి సమక్షంలో ఈ కార్యక్రమం జరపాలని నిర్ణయించుకున్నాం. తద్వారా సీనియర్ సిటిజెన్లను గౌరవించినట్లు అవుతుందని భావిస్తున్నాం. జతపరిచిన ఆహ్వాన పత్రంలో వివరాలు ఉన్నాయి. మీరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాం.

– మానవ వికాస వేదిక

మేడిపల్లికి అద్దేపల్లి సాహిత్య విమర్శ పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య విమర్శ పురస్కారం 2023వ సంవత్సరానికి గానూ ప్రముఖ విమర్శకుడు మేడిపల్లి రవికుమార్ (తిరుపతి)కి ప్రదానం చేస్తున్నాం. మేడిపల్లి రవికుమార్ విమర్శకునిగా కవిత్వ వక్తగా ఎంతోమందిని ఉత్తేజితుల్ని చేసినవారు. తెలుగు కవిత్వంపై సాధికారికంగా వ్యాఖ్యానించగలిగిన విమర్శకుల్లో ఒకరు. 2017 నుంచి తెలుగులో కవిత్వ విమర్శకు అద్దేపల్లి రామమోహనరావు పేరిట ఆయన జన్మదిన సందర్భంగా సెప్టెంబర్‌లో కవిత్వ విమర్శ పురస్కారం ఇస్తున్నాం. 2017లో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 2018లో కడియాల రామమోహనరాయ్, 2019లో కాత్యాయనీ విద్మహే లకు ఈ పురస్కారం ఇచ్చాము. 2020లో కరోనా కారణంగా ఇవ్వలేదు. 2021లో పాపినేని శివశంకర్‌కు, 2022లో కె.పి. అశోక్ కుమార్‌కు ఈ పురస్కారాన్ని ఇచ్చాము. 2023వ సంవత్సరానికి గానూ మేడిపల్లి రవికుమార్‌కు ఈ పురస్కారం ఇస్తున్నాము. అద్దేపల్లి రామమోహనరావు జన్మదిన మాసం సెప్టెంబర్ 9వ తేదీన కాకినాడలో జరిగే సభలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది


– అద్దేపల్లి ఉదయభాస్కరరావు, కన్వీనర్
అద్దేపల్లి సాహిత్య విమర్శ పురస్కార వేదిక

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

అభివృద్ధిలో అసమానతలు

- తలసరి ఆదాయం దారుణం
- అనేక రంగాలలో వెనుకబాటు
- మోడీ సర్కార్ చెబుతున్న బలోపేత ఆర్థిక వ్యవస్థ అంతా డొల్లే
- క్షేత్రస్థాయిలో విలవిల్లాడుతున్న ప్రజలు



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ బ్రిటన్‌ను అధిగమించి ఐదో స్థానంలో నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొదలుకొని సంఘ్ పరివార్ నేతలంతా ప్రచార బాకాలూదుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' అవిశ్వాస తీర్మానానికి సమాధానం ఇచ్చినప్పుడు కూడా ప్రధాని ఈ విషయాన్ని గొప్ప చెప్పారు. కానీ దేశాభివృద్ధిలో ప్రాంతాలవారీ అసమానతలను, ప్రజల కొనుగోలు శక్తి క్రమేపి నిర్వీర్యం అవుతుండటాన్ని ఆయన ప్రస్తావించలేదని, వాస్తవానికి ఆయన చెప్పినంత పటిష్టంగా భారత ఆర్థిక వ్యవస్థ లేదని, అంతా డొల్ల అని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతానికి అయితే ప్రపంచంలో అమెరికాయే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. చైనా, జపాన్, జర్మనీలు ఆ తర్వాతి స్థానాలలో ఉన్నాయి. ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఎంతో స్పష్టంగా తెలియడం లేదు. ఒకప్పుడు మూడు ట్రిలియన్ డాలర్లు దాటిన మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం కరోనా సమయంలో తగ్గిపోయింది. జూన్ 12న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ట్వీట్ ప్రకారం 2023లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2023లో 3.75 ట్రిలియన్ డాలర్లు. ఎందుకో తెలియదు గానీ ఆ తర్వాత ఆ ట్వీట్‌ను తొలగించారు. 3.2 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ ఆరో స్థానంలోకి వెళ్లిపోయింది. గనుక మన ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో దాని పరిమాణం 3.5 ట్రిలియన్ డాలర్లు ఉండవచ్చునని చెబుతున్నారు.

తలసరి ఆదాయం పెరిగితేనే...

ఇప్పుడు ఐదో స్థానానికి చేరిన మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే మూడో స్థానంలో నిలుస్తుందని మోడీ చెబుతున్నారు. ప్రపంచంలోనే మనది అత్యధిక జనాభా కలిగిన దేశం. కాబట్టి ఆర్థిక వ్యవస్థ ఒకటో స్థానానికి చేరినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అయితే బలపడుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయా అన్నదే ఇక్కడ ప్రశ్న. ప్రజల ఆదాయం పెరిగితే వ్యయం కూడా దానంతట అదే పెరుగుతుంది. వారి జీవితాలు ఆనందంగా గడుస్తాయి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. బ్రిటన్ ప్రజల జీవన ప్రమాణాలకు, భారత ప్రజల జీవన ప్రమాణాలకు మధ్య చాలా తేడా ఉంది. మన దేశ ప్రజల తలసరి ఆదాయంతో పోలిస్తే బ్రిటన్ ప్రజల తలసరి ఆదాయం 18 రెట్లు అధికం. కాబట్టి ఆర్థిక వ్యవస్థ పెరిగితే ఒరిగేదేమీ ఉండదు. ప్రజల తలసరి ఆదాయం పెరగడమే ముఖ్యం.

అంగోలా కంటే తక్కువే

మన దేశంలో ప్రజల తలసరి ఆదాయం చాలా దారుణంగా ఉంది. పేద దేశమైన అంగోలాలో కంటే మన దేశంలో తలసరి ఆదాయం తక్కువే. ఈ విషయంలో మన దేశం 197 దేశాలలో 142వ స్థానంలో ఉంది. మన తలసరి ఆదాయం 2601 డాలర్లు. దీనితో పోలిస్తే అమెరికాలో 31 రెట్లు, జపాన్, ఇటలీ దేశాలలో 14 రెట్లు ఎక్కువ. జనాభా అధికంగా ఉండడం వల్లే మన తలసరి ఆదాయం తక్కువగా ఉన్నదని కొందరు చేస్తున్న వాదనలో పస లేదు. ఎందుకంటే జనాభా అధికంగా ఉన్న చైనాలో తలసరి ఆదాయం మన దేశంతో పోలిస్తే ఐదు రెట్లు అధికంగా ఉంది. బడా దేశాల సంగతి పక్కన పెడితే మనం ఎన్నడూ పేరు కూడా వినని దేశాలైన వనటూ, సావో టోమ్ ప్రిన్సిప్‌లలో సైతం మన కంటే తలసరి ఆదాయం అధికంగానే ఉంది. చివరికి ఐవరీ కోస్ట్‌లో కూడా తలసరి ఆదాయం మన కంటే ఎక్కువగానే ఉంది.

తలసరి ఆదాయాన్ని లెక్కించడంపై కూడా పలు వివాదాలు ఉన్నాయి. అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తల ఆదాయంతో పాటు అతి తక్కువ వేతనం పొందే వ్యక్తిని కూడా పరిగణనలోకి తీసుకొని సగటు తలసరి ఆదాయాన్ని నిర్ణయిస్తారు. కాబట్టి కేవలం తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నంత మాత్రాన కూడా దేశ ప్రజలందరి ఆదాయం పెరుగుతోందని, వారి జీవితాలు భేషుగ్గా సాగుతున్నాయని అనుకోవడం పొరబాటే అవుతుంది.

నిరాశాజనకం...దయనీయం

ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో ప్రపంచంలో ఐదో స్థానంలో ఉన్నప్పటికీ అనేక ఇతర రంగాలలో మన స్థానం అట్టడుగునే ఉంటోంది. అత్యంత ఆనందదాయకమైన దేశాలలో మనది 125వ స్థానం. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన పది దేశాలలో ఏ ఒక్కటి కూడా ఈ జాబితాలో లేదు. పత్రికా స్వే చ్ఛతో 161 వ స్థానం. మానవాభివృద్ధి సూచికలో కూడా మనం 130వ స్థానంలో ఉన్నాము.

దీనిని బట్టి మనకు అర్థమవుతోంది ఏమంటే ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్న మాత్రాన దేశం సుసంపన్నం కాదు. తలసరి ఆదాయం పెరుగుతున్నప్పుడు, ప్రజలకు సుపరిపాలన లభిస్తున్నప్పుడు, వారికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే దేశం సౌభాగ్యవంతమవుతుంది.

పేదలు నిరుపేదలుగా...

ప్రపంచంలో ధనవంతులు మరింత సంపన్నులుగా, పేదలు మరింత నిరు పేదలుగా మారిపోతున్నారు. అభివృద్ధిలో అసమానతలే దీనికి కారణం. సంపన్నుల ఆదాయం శరవేగంగా పెరుగుతుంటే పేదల ఆదాయం పాతాళానికి పడిపోతోంది. సంపన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో అభివృద్ధిలో అసమానతలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దేశ జనాభాలో ఐదు శాతం మంది చేతిలో 60% సంపద పోగుపడి ఉంది. చివరి యాభై శాతం జనాభా చేతిలో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉంది.

2020లో దేశంలో 102 మంది బిలయనీర్లు ఉండగా ఈ సంవత్సరంలో వారి సంఖ్య 163కు పెరిగింది. ఒక వైపు సంపన్నుల సంపద పెరుగుతుంటే మరోవైపు పేదల సంఖ్య, వారిలో పేదరికం కూడా పెరుగుతోంది. 2018లో ఆకలితో అల్లాడిన భారతీయుల సంఖ్య 19 కోట్లు ఉండగా 2022 నాటికి 35 కోట్లకు పెరిగింది. 2022లో చనిపోయిన ఐదేళ్ల లోపు చిన్నారులలో 65 శాతం మంది ఆకలితోనే ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు తెలిపింది.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పాలనలోనే...

రెండు సంవత్సరాల క్రితం నిటి ఆయోగ్ ఓ నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం దేశంలోని ఐదు నిరుపేద రాష్ట్రాలలో నాలుగు రాష్ట్రాలలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలే నడుస్తున్నాయి. బీహార్ (అప్పుడు ఆ రాష్ట్రంలో బీజేపీ, జేడీయూ సంకీర్ణ ప్రభుత్వం పనిచేస్తోంది) మొదటి స్థానంలో ఉండగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే బీహార్‌లో 52 శాతం, జార్ఖండ్‌లో 42 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 38 శాతం, మధ్యప్రదేశ్‌లో 37 శాతం జనాభా పేదలే. బలమైన ఆర్థిక వ్యవస్థ ఏ దేశానికైనా అవసరమే కానీ ప్రజల తలసరి ఆదాయం పెరగడం అంతకంటే అవసరం. అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలలోనూ ఒకేలా ఉండాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. లేనిపక్షంలో అదానీ, అంబానీ సహా దేశంలోని అతి కొద్దిమంది బిలియనీర్లు, సంపన్న వర్గం ఆర్థికాభివృద్ధి ప్రయోజనాలను సొంతం చేసుకుంటారు. పేదలు మాత్రం ఆకలితో అలమటిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతూనే ఉంటారు.

గాంధీ స్మారక భవనం కూల్చివేసిన యోగి సర్కార్

- వారణాసిలో సర్వ సేవా సంఘ్ భవనం నేలమట్టం
- గాంధేయవాదుల నిరసన

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని రఘుత్ ప్రాంతంలో గాంధీ సామాజిక సేవా సంస్థ అఖిల భారత సర్వ సేవా సంఘ్‌కు చెందిన 12 భవనాలను కూల్చివేయటం ఆందోళనకు దారి తీసింది. శనివారం 15 నుంచి 20 వరకు భవనాలను కూల్చివేసినట్టు కొన్ని మీడియా నివేదికలు వెల్లడించాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కూల్చివేత కసరత్తు 500 మంది పోలీసుల సమక్షంలో జరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడు జయప్రకాష్ నారాయణ్ సహ-స్థాపన చేసిన గాంధీ విద్యా సంస్థాన్‌ను కూడా కలిగి ఉన్న ఆస్తిని నేలమట్టం చేయడానికి ఆరు బుల్‌డోజర్‌లు రంగంలోకి దిగినట్టు వార్తలు వెలువడ్డాయి.


ఇటు కూల్చివేతకు వ్యతిరేకంగా పలువురు గాంధేయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ వారసత్వాన్ని నాశనం చేసే ప్రయత్నమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలు చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘ్ భవనాన్ని నిర్మించిన 12.90 ఎకరాల స్థలంపై ఉత్తర రైల్వే తన యాజమాన్య హక్కును ప్రకటించుకున్నది. కానీ సంఘ్ మాత్రం 1960, 1961, 1970లో కొనుగోలు చేసిన సేల్ డీడ్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి ఆస్తిని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నది. అయితే, ఈ విషయంలో జిల్లా మేజిస్ట్రేట్ జూన్ 26న రైల్వేకు అనుకూలంగా తీర్పునిస్తూ, రైల్వే భూమిలో నిర్మించిన సంస్థ నిర్మాణాలను కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టు నుంచి కూల్చివేత ఉత్తర్వుపై సంఘ్ స్టే తీసుకురాలేకపోయింది. యూపీ ప్రభుత్వం, కేంద్రం తీరుపై వారణాసి శాఖ అధిపతి రామ్ ధీరాజ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

తప్పుబట్టిన కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, యూపీ ఇన్‌ఛార్జ్ ప్రియాంక గాంధీ వాద్రా తన ఫేస్‌బుక్ పేజీలో కూల్చివేతను "జాతి పిత మహాత్మా గాంధీ వారసత్వంపై దాడి"గా అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ కూడా ఈ చర్యను ఖండించారు. బిజెపి తన హద్దులను దాటిపోతున్నదని ఆరోపించారు. మేధా పాట్కర్, యోగేంద్ర యాదవ్, రాకేష్ టికాయత్ వంటి సామాజిక కార్యకర్తలు కూడా నెలరోజుల పాటు కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసనలు చేసిన వందలాది మందిలో ఉన్నారు.

దేశ ఆరోగ్య వ్యవస్థ నిర్వీర్యం


- ఎయిమ్స్‌లోనూ సిబ్బంది కొరత
- కేంద్రంపై మల్లికార్జున్ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం దేశ ఆరోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేసిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆసుపత్రుల్లోనూ వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ప్రజలు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఉన్న 19 ఎయిమ్స్‌లలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. 'కేంద్రంలోని దోపిడీ సర్కార్ దేశ ఆరోగ్య వ్యవస్థను అనారోగ్యంగా మార్చింది. మోడీ మాట్లాడే ప్రతి మాటలో కేవలం అబద్ధాలు మాత్రమే ఉంటాయి. దేశవ్యాప్తంగా చాలా ఎయిమ్స్‌లను ఏర్పాటు చేశామని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, దేశంలోని ఎయిమ్స్‌లు తీవ్రంగా వైద్యులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి. కరోనా సమయంలోనూ కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించింది. ఆయుష్మాన్ భారత్ పేరుతో స్కామ్‌లకు పాల్పడ్డారు. కానీ, ఇప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉన్నారు. మీ ప్రభుత్వానికి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది' అని ఖర్గే ట్వీట్ చేశారు.

బిజెపి సర్కార్‌ది అదృశ్య అభివృద్ధి

- కేంద్రంపై ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్



పాట్నా : బీహార్ ఎయిమ్స్‌పై కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్‌ల మధ్య ట్వీట్ల వార్ కొనసాగుతోంది. మోడీ ప్రభుత్వానిది 'అదృశ్య అభివృద్ధి' అని బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ విమర్శించారు. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తేజస్వీ యాదవ్‌పై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ విమర్శలపై ఆరోగ్య శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న తేజస్వీ యాదవ్ స్పందించారు.

'ఎయిమ్స్ కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇంకా స్థలాన్ని ఖరారు చేయలేదని, కానీ ప్రధాని మోడీ అక్కడ ఎయిమ్స్‌ను ప్రారంభించామని తప్పుడు క్రెడిట్ తీసుకుంటున్నారని అన్నారు. ఇది ఎలాంటి అదృశ్య అభివృద్ధి రాజకీయం ?' అని ప్రశ్నించారు. ఈ అంశంపై లేఖకు, అభ్యర్థనలకు మన్‌సుఖ్ మాండవీయ స్పందించలేదని అన్నారు.

ఈ ట్వీట్‌లపై కేంద్రమంత్రి దీనిపై కేంద్ర మంత్రి మాండవీయ ట్విటర్‌లో స్పందిస్తూ.. 2020లో ఎయిమ్స్ దర్భంగాకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. నిర్మాణం కోసం 2021లో బీహార్ ప్రభుత్వం భూమి కూడా ఇచ్చిందని, అయితే బీహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2023లో ఆ స్థలాన్ని మార్చారని అన్నారు. ఈ ఆరోపణలపై తేజస్వీ యాదవ్ స్పందించారు. "మీరు వివరించిన కాలం నుండి చాలా ఏళ్ల వరకు బీహార్ ఆరోగ్య శాఖ బాధ్యతలను బిజెపికి చెందిన వారే నిర్వహిస్తున్నారు" అని ట్విటర్‌లో పేర్కొన్నారు. " మీరు బహుశా వారి వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నారు" అంటూ ఎద్దేవా చేశారు.

ఐఐటి-ఢిల్లీలో పరీక్షల కుదింపు

- ఒక సెట్ మిడ్-సెమిస్టర్ పరీక్ష రద్దు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు ఐఐటీల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యల ఘటనలు కలవరపెడుతున్నాయి. మత, కులపరమైన వేధింపులు, వ్యక్తిగత సమస్యలతో పాటు చదువులు, పరీక్షల ఒత్తిడి కూడా విద్యార్థుల బలవన్మరణాలకు కారణమవుతోందనే వాదనలు ఉన్నాయి. ఈ పరిణామాల నడుమ ఐఐటి-ఢిల్లీ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దష్టిలో ఉంచుకుని, వారిపై పరీక్షల భారాన్ని తగ్గించేందుకు.. పరీక్షా విధానంలో మార్పులు చేపట్టినట్లు ఐఐటి-ఢిల్లీ డైరెక్టర్ రంగన్ బెనర్జీ వెల్లడించారు. 'ఇదివరకు ఒక సెమిస్టర్‌లో రెండు సెట్ల పరీక్షలు, ఫైనల్ ఎగ్జామ్‌తోపాటు క్విజ్, అసైన్‌మెంట్స్ వంటి మూల్యాంకనాలు ఉండేవి. దీంతో పరీక్షల క్యాలెండర్ అతిగా నిండిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థులపై పరీక్షల భారం తగ్గించాలని నిర్ణయించాం. ఈ విషయంలో అంతర్గతంగా సర్వే నిర్వహించి.. ఫ్యాకల్టీ, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాం. దీని ఆధారంగా ఒక సెట్ మిడ్-సెమిస్టర్ పరీక్షను తొలగించాలని నిర్ణయించాం. మిగతావన్నీ యథాతథంగా ఉంటాయి. ప్రస్తుతం కొనసాగుతోన్న సెమిస్టర్ నుంచే ఇది అమల్లోకి వస్తుంది' అని బెనర్జీ మీడియాకు తెలిపారు. ఆత్మహత్యల నివారణకుగానూ.. విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందేలా కౌన్సెలింగ్ అందించడం, మెంటార్‌లను నియమించడం వంటి చర్యలు కూడా తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఒక్క ఏడాదిలోనే వివిధ ఐఐటిల్లో ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అత్యున్నత విద్యాలయాల్లో సంఘ్ పరివార్ జోక్యం పెరగడం, కుల, మతపరమైన వేధింపులు పెరిగిపోవడం వల్లే బలవన్మరణాలకు ప్రధానకారణమని పలు కథనాలు వెలువడ్డాయి. ఆ దిశగా చర్యలు చేపట్టకుండా పరీక్షలు కుదించడమేంటని విద్యావేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు

సిమ్లా : హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షాల కారణంగా పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. దీంతో ఆదివారం రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండి జిల్లాలో వర్షాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బిలాస్‌పూర్ జిల్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాకేష్‌లో కొండలపై నుంచి మట్టి, రాళ్లు దొర్లిపడి జాతీయ రహదారి 205పై రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని బిలాస్‌పూర్ జిల్లా యంత్రాంగం తెలిపింది. మరోవైపు మండి నుంచి సిమ్లాకు వెళుతున్న హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌టిసి బస్సు లోయలో పడి 12 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోలన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి సిమ్లా-కల్కా మార్గంలో జాతీయ రహదారి 5ను పూర్తిగా మూసివేశారు.

హిమాచల్‌ప్రదేశ్‌తో పాటు పంజాబ్, హర్యానా, ఛండీగఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో ఈ నెల 14వ తేదీ వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ (ఐఎండి) ఆదివారం తెలిపింది.

మా గ్రామంలోకి రావద్దు

- ముస్లింలకు హర్యానా గ్రామ పంచాయితీల హుకుం

చండీఘర్ : హర్యానాలోని నూహ్‌లో గత నెల 31న చెలరేగిన మతపరమైన హింసాకాండ నేపథ్యంలో తమ గ్రామాలలోకి ముస్లింల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆ రాష్ట్రంలోని కొన్ని గ్రామ పంచాయితీలు తీర్మానాలు ఆమోదించాయి. వీటిపై విమర్శలు చెలరేగడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయా పంచాయితీలు, సర్పంచులకు షోకాజ్ నోటీసులు పంపింది. హర్యానా గ్రామ పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 51 ప్రకారం ఏడు పంచాయితీలు, వాటి సర్పంచులకు సంబంధిత జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు పంపారని అధికారులు తెలిపారు. ఈ సెక్షన్ ప్రకారం పంచాయితీ పాలకవర్గాన్ని రద్దు చేయవచ్చు. లేదా సర్పంచ్‌ని పదవి నుండి తొలగించవచ్చు. పంచాయితీల నుండి సమాధానం అందిన తర్వాత వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. మత సామరస్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నించే వారిని ఉపేక్షించబోమని, తప్పనిసరిగా చర్య తీసుకుంటామని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా రేవరి, జజ్జర్, మహేంద్రఘర్ జిల్లాలలోని పలు గ్రామ పంచాయితీలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని ఓ వార్తా పత్రిక తెలిపింది. అయితే వీధి వ్యాపారుల పూర్వాపరాలు తెలుసుకునేందుకే షోకాజ్ నోటీసులు జారీ చేశామని సర్పంచ్‌లు వివరణ ఇచ్చారు. వీధి వ్యాపారులలో ఎక్కువ మంది ముస్లింలే కావడం గమనార్హం.

నిరసన తెలిపిన ముస్లింలపై ఎన్‌ఎస్‌ఎ ప్రయోగం

- మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ : ఇస్లాం మతం విషయంలో సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్ట్‌లు పెట్టిన వ్యక్తిపై వివాదాస్ప నినాదాలు చేసిన కొందరు ముస్లింలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కఠినమైన జాతీయ భద్రతా చట్టం(ఎన్‌ఎస్‌ఎ)ను ప్రయోగించనున్నది. రాష్ట్రంలోని రత్లాం జిల్లాలో కొంతమందిపై ఎన్‌ఎస్‌ఎ కింద శిక్షార్హమైన చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర మంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు.

ఈ నెల 9న రత్లామ్‌లోని దీన్ దయాళ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసు అవుట్‌పోస్ట్ వెలుపల ముస్లిం సమాజానికి చెందిన పెద్ద సమూహం గుమిగూడి ఇన్‌స్టాగ్రామ్‌లో తమ విశ్వాసానికి వ్యతిరేకంగా అభ్యంతరకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు వ్యక్తిపై కొన్ని వివాదాస్పద నినాదాలను వారు వినిపించారని పోలీసులు తెలిపారు. అయితే, ఈ నినాదాలు చేసిన నిరసనకారులను అరెస్టు చేస్తామనీ, ఎన్‌ఎస్‌ఎ కింద వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించటం గమనార్హం. మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదనీ, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని సామాజికవేత్తలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చంపుతామంటూ బహిరంగ బెదిరింపులకు దిగుతున్న హిందూత్వ శక్తులపై చర్యలు తీసుకోవటంలో మీనమేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. సంఘ్ సిద్ధాంతంతో ఒక వర్గాన్ని అణచివేయాలని చూస్తున్నదని వారు ఆరోపించారు.

స్వాతంత్ర్య వేడుకల దృష్ట్యా మణిపూర్‌లో భద్రత కట్టుదిట్టం

ఇంఫాల్ : స్వాతంత్ర్య వేడుకల దృష్ట్యా రాష్ట్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు మణిపూర్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఐదు జిల్లాల్లోని ప్రమాదకర ప్రాంతాల్లో కూడా సోదాలు నిర్వహించి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఇంఫాల్ లోయకు చెందిన కొన్ని నిషేధిత సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

ఇంఫాల్ - పశ్చిమ, ఇంఫాల్-తూర్పు, తౌబాల్, బిష్ణుపూర్ మరియు చురచంద్‌పూర్ జిల్లాల్లో ఈ సోదాలు చేపట్టినట్లు వెల్లడించాయి. 12 ఆయుధాలు, ఆరు మందుగుండు సామగ్రి, ఎనిమిది పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని మణిపూర్ పోలీసులు తెలిపారు. ఆగస్ట్ 15న జరగనున్న మార్చ్ ఫాస్ట్ కోసం బిఎస్‌ఎఫ్, పోలీస్, అస్సాం రైఫిల్స్ సిబ్బంది మరియు విద్యార్థులు రిహార్సల్స్ చేపడుతున్నాయని ప్రకటించారు.

చురాచంద్‌పూర్ జిల్లా తుయ్‌బౌంగ్ ప్రాంతంలోని పీస్ గ్రౌండ్‌లో శనివారం రిహార్సల్స్ జరిగాయని అన్నారు. ఆగస్ట్ 15న కో ఆర్డినేటింగ్ కమిటీ (కార్కామ్) సమ్మెకు పిలుపునివ్వడంతో రాష్ట్రంలో భద్రతా బలగాలను గణనీయంగా పెంచామని ఓ అధికారి తెలిపారు. కార్కామ్‌లో యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) సహ మరో మూడు నిషేధిత సంస్థలు ఉన్నాయని అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ డిపిగా జెండా

- దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 13 నుంచి 15 వరకు కేంద్రం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దేశ ప్రజలకు ప్రధాని మోడీ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా తప్పకుండా సామాజిక మాధ్యమాల్లోని తమ ఖాతాల్లో ప్రొఫైల్ డిపిగా జాతీయ జెండాను పెట్టుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఉదయం తన ట్విట్టర్ ఖాతాలో ట్వీట్ చేశారు. దేశం, మన మధ్య బంధాన్ని పెంచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ప్రధాని తెలిపారు.

12 సెల్ఫీ పాయింట్లు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పలు చోట్ల సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి.. పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందించనుంది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. 'వివిధ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సెల్ఫీ పాయింట్లను దేశ రాజధానిలోని 12 ప్రదేశాల్లో ఏర్పాటు చేశాం. ఆ పాయింట్ల వద్ద ఫొటోలు తీసుకుని 'మై గవ్' పోర్టల్లో అప్లోడ్ చేయవచ్చు. ఈ పోటీలు ఆగస్టు 15 నుంచి 20 వరకు జరుగుతాయి. ఒకటి కంటే ఎక్కువ ఫొటోలను కూడా పంచుకోవచ్చు. సెల్ఫీలు పంపిన వారిలో 12 మందిని ఎంపిక చేసి ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున బహుమతి అందిస్తాం' అని రక్షణశాఖ పేర్కొంది.

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఉత్తరాఖండ్‌లో ఓ మారుమూల గ్రామానికి చెందిన మహిళకు ఆహ్వానం పంపారు. ఆమె గతేడాదిలో మోడీకి యాపిల్ పచ్చడి పంపిన మహిళ. అయితే ఈ అతిథుల్లో గ్రామ సర్పంచులు (వైబ్రెంట్ విలేజెస్), పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం, పిఎం కౌశల్ వికాస్ యోజన పథకం లబ్ధిదారులు కూడా ఉన్నారు. వీరితో పాటూ ఉపాధ్యాయులు, నర్సులు, మత్స్యకారులు, ఖాదీ రంగానికి చెందిన శ్రామికులు తదితరులను వేడుకలకు ఆహ్వానించినట్లు కేంద్ర రక్ష మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ నెల 15న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమంలో వీరందరూ పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆగస్టు 15 వేడుకలకు 1,800 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. దీంతోపాటు 17,000 మంది ఆహ్వానితులకు ఈ ఆహ్వానాలు అందజేశారు.

ఫొటో జర్నలిస్టు హత్యపై అర్జెంటీనాలో వెల్లువెత్తిన నిరసనలు



బ్యూనస్ ఎయిర్స్ : అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ తరహాలోనే అర్జెంటీనాలో జరిగిన ఘటనపై ప్రజలు పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. గత వారాంతంలో రాజధానిలో శాంతియుతంగా జరిగిన చిన్న ప్రదర్శనపై సిటీ పోలీసులు పైశాచికంగా దాడి చేశారు. ఈ ప్రదర్శన వల్ల ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకున్నా ఒబెలిస్క్ స్క్వేర్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న ఫకుండో మోలారెస్‌ను రాజధాని నగర పోలీసులు పట్టుకుని, అతని తలను నేలపై ఆన్చి ఉంచి, అతని చేతులను వెనుకకు తిప్పి గట్టిగా అదిమి చంపారన్న వార్త తెలియగానే అర్జెంటీనా ప్రజలు ఆగ్రహావేశాలతో రగిలిపోయారు. ఫొటో జర్నలిస్టు మొలారెస్ మృతికి బాధ్యులైన పోలీసులను శిక్షించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.ఈ కేసులో మొలారెస్‌కు న్యాయం చేయాలని వారు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ఈ ఉద్రిక్తతల మధ్య ఆదివారం అర్జెంటీనాలో ప్రైమరీస్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకంగా రెబెలియన్ పాపులర్ గ్రూపునకు చెందిన కార్యకర్తలు,ఇతర ప్రజాతంత్రవాదులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సిటీ పోలీసుల నేరపూరిత వైఖరి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రోడ్రిగ్జ్ లారెటా పేర్కొహ్యాగో కాచోరో గోడోయ్.డిప్యూటీ సెక్రటరీ, రికార్డో పెయిద్రో మాట్లాడుతూ, మొలారెస్‌ది రాజ్యం చేసిన హత్య అని చెప్పారు.."ఫకుండో మొలారెస్‌ను పోలీసు బలగాలు నేలపై పడవేసి అదిమి చంపడాన్ని పలు సామాజిక సంస్థలు ఖండించాయి వారు అతడ్ని కాళ్ళతో తారుపై నొక్కారు, తన్నారు. అని ఈ సంస్థలు పేర్కొన్నాయి. అక్టోబరు 22న జరిగే సాధారణ ఎన్నికలలో పోటీ చేయగలిగే అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రైమరీస్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు.

పాకిస్తాన్‌లో చైనా ఇంజినీర్లపై తీవ్రవాదుల దాడి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని చైనాకు చెందిన ఇంజినీర్ల కాన్వాయ్‌పై తీవ్రవాదులు దాడి చేశారు. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో ఓడరేవు నగరమైన గ్వాదర్‌లో ఆదివారం ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రవాదులను కాల్చిచంపినట్లు అధికారులు తెలిపారు. చైనా ఇంజనీర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదని అన్నారు. చైనా -పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఇసి)లో పెద్ద సంఖ్యలో చైనీయులు పనిచేస్తున్నారు. గ్వాదర్‌లో చైనా ఇంజినీర్లకు చెందిన కాన్వాయ్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) కాల్పులు జరిపినట్లు తెలిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది దాడిని ప్రతిఘటించాయని, సుమారు రెండు గంటల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ఓ చైనా ఇంజినీరు, భద్రతా సిబ్బంది ఒకరు గాయపడినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు మరణించినట్లు తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పాకిస్తాన్ సెనేటర్ సర్ఫరాజ్ బుగ్తీ పేర్కొన్నారు.

అమెరికాను వణికిస్తున్న కార్చిచ్చు

- తగలబడుతున్న మౌయి ద్వీపం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

లాస్‌ఏంజెల్స్ : అమెరికా చరిత్రలోనే అత్యంత ఘోరమైన కార్చిచ్చుగా పేర్కొనబడుతున్న హవాయి కార్చిచ్చులో 2,200కి పైగా నిర్మాణాలు ధ్వంసమయ్యాయి.హవాయిలోని "ఆల్-హాజర్డ్ స్టేట్‌వైడ్ అవుట్‌డోర్ వార్నింగ్ సైరన్ సిస్టమ్ అని పిలవబడే సైరన్ సిస్టమ్ ఇటీవలి కాలం రెండుసార్లు తప్పుగా మోగింది. హవాయి రాష్ట్రంలోని గొలుసుకట్టు దీవుల్లో రెండవ అతిపెద్ద దీవి మౌయిలోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ పొగలు గక్కుతుండడంతో ఆకాశం ఎర్రబారింది. కార్చిచ్చులో మృతుల సంఖ్య 2018 నాటి కాలిఫోర్నియా క్యాంప్ ఫైర్ కంటే ఎక్కువగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటివరకు 93 మంది చనిపోయినట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి మృతుల సంఖ్య అనేక రెట్లు ఎక్కువగా ఉంటుందని హవాయి గవర్నర్ జోష్ గ్రీన్ పేర్కొన్నారు.. గత 100 సంవత్సరాలలో అమెరికన్ చరిత్రలో అత్యంత ఘోరమైన కార్చిచ్చు ఇదే. హవాయి రాష్ట్ర హోదాకు ముందు 1946లో సంభవించిన ఘోరమైన సునామీ, బిగ్ ఐలాండ్‌లో 150 మందిని కబళించింది. మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంటుందనిశనివారం తెలిపారు.మౌయి పోలీస్ చీఫ్ జాన్ పెల్లెటియర్ మాట్లాడుతూ, పోలీస్ జాగిలాలు ప్రభావిత ప్రాంతాలలో కేవలం 3 శాతం మాత్రమే శోధించాయని చెప్పారు.

హవాయి రాష్ట్ర రాజధానిగా ఉన్న చారిత్రాత్మక పట్టణం లహైనా పూర్తిగా కాలిపోయింది. మౌయిలోని ఉత్తమ ఆకర్షణలలో ఒకటైన లహైనా కూడా దెబ్బతినిపోయింది. 12 వేల మందికి పైగా జనాభా కలిగివున్న ఈ పట్టణాన్ని ఏటా రెండు మిలియన్ల మంది సందర్శిస్తారు, '1960లలో సునామీ తర్వాత స్థాపించబడిన సైరన్ వ్యవస్థ ఇటీవలి సంవత్సరాలలో రెండుసార్లు పొరపాటున మోగింది. తాత్కాలిక ఇళ్లు, ఇళ్ల మరమ్మతులు, బీమా చేయని ఆస్తి నష్టాలను కవర్ చేయడానికి తక్కువ-ధర రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైట్ హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది.

అంతా అయిపోయింది, చివరికి చెక్క కర్ర కూడా లేదు" అని చంటల్ వీవర్, పయనీర్ ఇన్ హోటల్ మాజీ యజమాని కుమార్తె, లాహైనా ల్యాండ్‌మార్క్ పేర్కొన్నారు.





మీకోసం

బెల్లం కలిపిన పాలు రోజూ తాగితే, రుతు సమయంలో వచ్చే కడుపునొప్పి తగ్గుతుంది.

జీవన సౌరభం

ఓడిపోతున్నా అని తెలిసిన క్షణంలో కూడా పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు.

దేశభక్తి



దేశభక్తి కలిగి ఉండి
దేశకీర్తి పెంచెదము
దేశమంటే మట్టి కాదని
మనుషులమని చాటెదము

సామ్యవాద భావనను
అందరమూ కలిగుందుము
దేశసంపదను పెంచి
అందరికీ పంచెదము

సమత మమత కలిగి మనం
సోదరులుగ కలిసుందుము
ప్రతి ఒక్కరు సైనికులై
ప్రగతి బాట నడిచెదము

శత్రువులను ఎదిరించి
ఐక్యతను చాటెదము
జగతిన మన దేశాన్ని
ఉన్నతంగా నిలుపుదుము

- రావిపల్లి వాసుదేవరావు,
94417 13136.

జెండా



సౌమ్య పదో తరగతి చదువుతోంది. జెండా వందనానికి తన తమ్ముని వెంట బెట్టుకుని వచ్చింది. బాబు ముద్దుగా ఉండడంతో అందరూ బుగ్గ గిల్లి ముద్దు చేస్తున్నారు. ఇంతలో సోషల్ టీచర్ రాగానే అందరూ 'గుడ్ మార్నింగ్ మేడమ్' అన్నారు. సౌమ్య తమ్ముడు కూడా వచ్చిరాని మాటలతో 'గుడ్ మార్నింగ్' అన్నాడు. 'గుడ్' అంది మేడమ్. జెండా ఎగురవేయటానికి స్టాఫ్ అంతా రావడంతో పిల్లలందరూ వరుసగా నిలుచున్నారు.

హెచ్ఎం గాయత్రి జెండాను ఎగురవేశారు. మువ్వన్నెల జెండా రెప రెప లాడుతుంటే పిల్లలందరూ శాల్యూట్ చేశారు. సౌమ్య తమ్ముడు కూడా శాల్యూట్ చేశాడు. పిల్లలందరికి మిఠాయిలు పంచారు. ఓ బుల్లి జెండాను గాయత్రి మేడమ్, ఆ బాబుకు ఇచ్చారు. ఆ జెండాను చూడగానే వాడు కేరింతలు కొట్టాడు. జెండాను అటు ఇటు ఊపుతూ ఆడుకున్నాడు. కాసేపటికి జెండా కింద పడిపోయింది. ఈసారి వాడు దాన్ని తొక్కుతూ ఆడుకున్నాడు. పిల్లలు అందరూ చూస్తున్నారే కాని ఎవరూ వారించలేదు. అప్పుడు, సోషల్ టీచర్ వాడి దగ్గరకు వెళ్ళి 'బాబూ, జెండాను అలా తొక్కరాదు, మురికి చేయరాదు, నలప రాదు. చక్కగా ఉండాలి, తీసి జేబులో పెట్టుకో' అన్నారు. ఇంతలో సౌమ్య దగ్గరకు వచ్చి 'సారీ మేడమ్' అంది. 'సారీ కాదు సౌమ్యా.. ఇంటికి వెళ్ళాక జెండాను శుభ్రంగా ఉతుకు. మురికిగా ఉండకూడదు.' అని చెప్పారు.

అలాగే మేడమ్ అంది సౌమ్య.

- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027

నేను గీసిన బొమ్మ



కె. రేవతి, 8వతరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com


సగం పిల్లల వద్ద స్మార్ట్ ఫోన్లు!

పిల్లలు ఫోన్లను తెగ వాడేస్తున్నారని, ఎప్పుడు చూసినా ఫోనుతోనే గడుపుతున్నారని పెద్దలంతా వాపోతుంటారు. మన ఇంట్లో.. పక్కింట్లో.. బంధువుల ఇంటికి వెళితే అక్కడ.. ఎక్కడ చూసినా ఇవే ఫిర్యాదులు.. రైలు, బస్సు, ఏ ప్రయాణమైనా ఫోనుతోనే.. ఇలా దేశంలో ఎంతమంది పిల్లలు ఫోన్లకు అతుక్కుపోతున్నారో ఎవరైనా.. ఎప్పుడైనా అంచనా వేశారా? ఆ సమాచారం ఇప్పుడు అందుబాటులో ఉంది. తాజాగా ఢిల్లీకి చెందిన డెవలప్‌మెంట్ ఇంటిలిజెంట్ యూనిట్‌కు చెందిన సంస్థ చేసిన సర్వేలో ఆ వివరాలు వున్నాయి. 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గ్రామాల్లో 6 నుండి 16 ఏళ్ల లోపు పిల్లల మధ్య ఈ సర్వే నిర్వహించారు.



ఢిల్లీ ఆధారిత డెవలప్‌మెంట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (డిఐయు) ద్వారా నిర్వహించిన ఈ సర్వే, శంబోధి రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ట్రాన్స్‌ఫార్మింగ్ రూరల్ ఇండియా ఫౌండేషన్(టిఆర్ఐఎఫ్) చొరవతో రూపొందించారు.

గ్రామీణ విద్యార్థుల్లో దాదాపు సగం మంది (49.3 శాతం) స్మార్ట్ ఫోన్లు కలిగివున్నారు. వీరిలో 76.7 శాతం మంది విద్యార్థులు తమ ఫోన్లను వినోదానికి అంటే గేమ్స్, సినిమాలు వంటి వాటికి ఉపయోగిస్తున్నారు. వీరిలో 34 శాతం మంది విద్యార్థులు బోధనా అంశాల కోసం వినియోగిస్తున్నారు. 18 శాతం మంది ఆన్‌లైన్ ట్యూటోరియల్స్ సేవల కోసం ఉపయోగిస్తున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో అత్యధికంగా 58.32 శాతం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తుంటే.. 1 నుండి 3వ తరగతి విద్యార్థుల్లో 42.1 శాతం మంది ఉపయోగిస్తున్నారు.



ఇంట్లో చదువుకునే వెసులుబాటు ఉన్న విద్యార్థుల్లో 40 శాతం మంది తల్లిదండ్రులు టెక్స్ట్ బుక్స్‌కు బదులుగా స్మార్ట్‌ఫోన్లో దొరికే పాఠ్యాంశాలను పిల్లలకు సూచిస్తున్నారట. మరో 40 శాతం మంది స్కూలు బోధనకు సంబంధించిన అంశాల చర్చకై ప్రతిరోజూ స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ఈ తరహా చర్చలను వారానికి కొన్ని సార్లు మాత్రమే చేసే తల్లిదండ్రుల సంఖ్య 32 శాతంగా ఉంది.

పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రుల చొరవను కూడా ఈ సర్వే పరిశీలించింది. 84 శాతం మంది తల్లిదండ్రులు ప్రతి పేరెంట్-టీచర్ మీటింగ్‌కి హాజరవుతున్నట్లు పేర్కొంది. డ్రాపౌట్స్ రేట్ల వివరాలు చూస్తే.. ఆర్థికపరమైన కారణాలతో 36.8 శాతం మంది బాలికలు స్కూలు మానేస్తున్నారు. వీరిలో 21.1 శాతం మంది ఇంటి పనుల నిమిత్తం, తమ కంటే చిన్నవారైన తమ్ముడు, చెల్లెలి ఆలనాపాలనా చూసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. అబ్బాయిల్లో.. చదువుపై ఆసక్తి లేక 71.8 శాతం మంది, కుటుంబ పోషణకై 48.7 శాతం మంది స్కూలుకు దూరమయ్యారు.

పిల్లల చదువు పట్ల తల్లిదండ్రుల ఆకాంక్షలను కూడా ఈ సర్వే తేటతెల్లం చేసింది. కూతుర్లు ఉన్న తల్లిదండ్రుల్లో 78 శాతం మంది, కొడుకులు ఉన్న వాళ్లల్లో 82 శాతం మంది పిల్లలను గ్రాడ్యుయేషన్‌కి మించి చదివించాలనుకుంటున్నారు.

'స్టేట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఇన్ రూరల్ ఇండియా-2023' పేరుతో చేసిన ఈ సర్వేలో 6,229 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్కూలుకు వెళ్లే పిల్లల తల్లిదండ్రులు, స్కూలు మానేసిన పిల్లల తల్లిదండ్రులు, ఇంతవరకు స్కూల్లో పేరు నమోదు చేయని తల్లిదండ్రులుగా వివిధ కేటగిరీలో ఈ సర్వే నిర్వహించారు. పిల్లలు ఎన్ని రకాలుగా స్మార్ట్‌ఫోన్‌ని వాడుతున్నారో.. చదువు కోసం ఎంతమంది ఉపయోగిస్తున్నారో.. అన్న అంశాలు ఈ సర్వే ద్వారా మరోసారి వెలుగు చూశాయి.

పోషకాల 'తోట'కూర

ఆకుకూరలు అతి చౌకగా లభించే అన్ని పోషక విలువలు గల ఆహారం. వంద గ్రాముల తోటకూర తింటే 716 క్యాలరీల శక్తి శరీరానికి లభిస్తుంది. కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు, పీచు ఒక్కతోట కూరలోనే లభిస్తాయి. తోటకూరలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్, జింక్, కాపర్, మాంగనీస్, సెలీనియం వంటి ఖనిజాలతోపాటుగా గుండెకు మేలు చేసే సోడియం, పొటాషియం ఉంటాయి. రోజూ తోట కూర తింటే బరువు తగ్గుతారు. పీచు పదార్థం జీర్ణశక్తిని పెంచుతుంది. తోటకూర రక్తనాళాల్ని చురుగ్గా ఉంచుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచటం పాటు తక్షణశక్తి అందిస్తుంది. వేపుడు కంటే ఉడికించుకుని తింటేనే ప్రొటీన్లు శరీరానికి బాగా అందుతాయి. అధిక రక్తపోటు నియంత్రణకు తోటకూర దోహదపడుతుంది. హైపర్‌టెన్షన్‌తో బాధపడే వాళ్లకు ఎంతో మంచిది. విటమిన్-సి ఉంటుంది. సీజన్లు మారినప్పుడు వచ్చే రోగాలను తోటకూర అడ్డుకుంటుంది. ఆకుల్ని మెత్తగా రుబ్బి తలకు పట్టిస్తే జుట్టు రాలదు. చుండ్రు తగ్గుతుంది.





ఊపిరితిత్తుల ఆరోగ్యంలో విటమిన్ 'కె'

మన శరీరంలో వచ్చే వివిధ రకాల రుగ్మతలకు గల కారణాలలో విటమిన్ల లోపం ఒకటి. తాజాగా విటమిన్ కె లోపం వల్ల కలిగే రుగ్మతలపై తాజాగా ఓ నివేదిక వెలువడింది. మన శరీరంలో విటమిన్ కె స్థాయిలు పడిపోతే ఉబ్బసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గురక, ఊపిరితిత్తుల సమస్యలు తీవ్రమౌతాయని ఆ నివేదికలో తేలింది.

విటమిన్ కె సాధారణంగా కూరగాయలు, కూరగాయ నూనెలు, తృణధాన్యాల్లో ఎక్కువగా లభ్యమవుతుంది. ఇది రక్తం గడ్డ కట్టడంలో ఇది ముఖ్యపాత్ర వహిస్తుంది. గాయాలను నయం చేయడంలో సహకరిస్తుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యంలో చాలా స్వల్పంగా పనిచేస్తుందని ఇప్పటివరకు భావించారు. తాజా అధ్యయనం ప్రకారం... ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారికి విటమిన్ కె సప్లిమెంట్స్ ఇవ్వొచ్చని పరిశోధకులు అంటున్నారు.

కోపెన్హగెన్ యూనివర్శిటీ హాస్పటల్, కోపెన్హగెన్ యూనివర్శిటీ సంయుక్తంగా చేసిన ఈ సర్వేలో డానిష్ పరిశోధకుల బృందం పనిచేసింది. కోపెన్హగన్‌లో నివసించే వారిలో 4 వేలకు పైగా, 24 నుండి 77 ఏళ్ల మధ్య వయసు వారిని ఈ పరిశోధనలో పరిశీలించారు.

పరిశోధనలో పాల్గొన్న వ్యక్తులకు ఊపిరితిత్తుల పనితీరుకు సంబంధించిన పరీక్ష (స్పిరోమెట్రీ) నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించి చేసిన ఆ పరీక్ష తరువాత వారి జీవనశైలిపై కొన్ని ప్రశ్నలు వేశారు.

స్పిరోమెట్రీ పరీక్ష అంటే ఒక వ్యక్తి ఒక సెకను కాలంలో బయటికి వదిలే గాలి (ఫోర్స్‌డ్ ఎక్స్‌పిరేటరీ వాల్యూమ్ లేక ఎఫ్ఇవి1), అతను లోనికి పీల్చుకోగలిగే గాలి మొత్తం పరిమాణం (ఫోర్స్‌డ్ విటల్ కెపాసిటీ, ఎఫ్‌విసి) కొలుస్తుంది.

రక్తంలో విటమిన్ కె స్థాయిలు తక్కువ ఉన్న వ్యక్తుల్లో ఎఫ్ఇవి1, ఎఫ్‌విసిల పరిమాణాలు తక్కువగా ఉన్నాయని పరిశోధనలో తేలింది. సదరు వ్యక్తుల జీవనశైలిపై వేసిన ప్రశ్నల్లో కూడా వారు సిఒపిడి, ఆస్మా, గురక సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తేలింది. 'ఊపిరితిత్తులు, విటమిన్‌కె అంశం మీద ఇఆర్‌జె ఓపెన్ రీసెర్చ్ జర్నల్‌లో ప్రచురించిన ఈ పరిశోధన మొదటిది. ఇది మరిన్ని పరిశోధనలకు మార్గం వేస్తుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యంలో విటమిన్ కె కీలకమని మా పరిశోధనలో తేలింది' అంటున్నారు డాక్టర్ టోర్కిల్ జెస్పెర్సన్.

రెండు పెద్ద సినిమాలు

మిశ్రమ స్పందనలు

ఈ వారంలో రజనీకాంత్ నటించిన 'జైలర్', చిరంజీవి నటించిన భోళాశంకర్ సినిమాలు విడుదలై, థియేటర్ల వద్ద సందడిని నెలకొల్పాయి. అయితే, ఈ రెండు పైనా గొప్ప టాక్ రాలేదు. మిశ్రమ స్పందనలు వచ్చాయి. ఈ ఇద్దరు హీరోలూ బాక్సాఫీసు వద్ద తలపడిన సందర్భాలు లేవు. కానీ, ఈసారి మాత్రం ఒక్క రోజు తేడాతో రెండు సినిమాలు విడుదలయ్యాయి.



బోళా ... అంత బాగోలా ... : మాస్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా, అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని చాలా చక్కగా చూపించే ప్రయత్నం చేశామని మూవీ మేకర్స్ 'బోళా శంకర్' గురించి ప్రచారం చేశారు. ఇది 2015లో వచ్చిన తమిళ సినిమా వేదాళంకి రీమేక్. ఇందులో చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, వెన్నెల కిషోర్, అన్నీ మాస్టర్, తులసి, మురళి శర్మ, రవి శంకర్, సుశాంత్, గెటప్ శ్రీను, రష్మీ గౌతం తదితరులు నటించారు. శంకర్ (చిరంజీవి) తన చెల్లెలు మహాలక్ష్మి (కీర్తి సురేష్)తో హైదరాబాదు నుంచి కలకత్తాకి మకాం మారుస్తాడు. అక్కడ లాస్య (తమన్నా) అనే లాయర్ పరిచయమౌతుంది. మహాలక్ష్మిని లాస్య సోదరుడు (సుశాంత్) ప్రేమిస్తాడు. ఇదిలా ఉంటే శంకర్ మహిళలను తరలించే ముఠాలను అంతం చేస్తూ ఉంటాడు. అదే అసలు కథకు లింకు. ప్రథమార్థంలో కామెడీ సన్నివేశాలు చాలావి అంతగా రక్తి కట్టలేదు. 'వేదాళం' చూడని వాళ్లకి కూడా తర్వాతి సీనేంటో ముందే అర్థమైపోతూ ఉంటుంది. సెకండాఫ్ పావు భాగం అవ్వగానే క్లైమాక్స్ వరకు కూర్చోవాల్సిన అవసరం లేనట్టు ప్రేక్షకులు భావిస్తారని ఒక సినీ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు.

కథలో కొన్ని మార్పులు చేసి చిరంజీవికి తగ్గట్టుగా మలిచామని మెహర్ రమేష్ చెప్పినా-అదంత గొప్పగా లేదని విమర్శలు వచ్చాయి. వేదాళం సినిమాకు, దీనికీ ఇంట్రడక్షన్ సీన్స్‌లో తప్ప పెద్ద తేడా ఏమీ లేదు. వెన్నెల కిషోర్, బ్రహ్మానందం ఉన్నా పెద్దగా నవ్వించలేదు. చిరంజీవి శ్రీముఖితో చేసిన కామెడీ రొమాన్స్, 'ఖుషీ' సీన్ రీక్రియేషన్ ఆకట్టు కునేలా లేవు. చిరంజీవి యంగ్‌గా కనిపిస్తూ, డ్యాన్సులు బాగా చేశారనే టాక్ వచ్చింది. కీర్తి సురేష్ చెల్లెలి పాత్రలో బాగా మెప్పించింది. మురళి శర్మ, తులసి తమ పాత్రలకు న్యాయం చేశారు. నటుడు రవిశంకర్ కూడా 'ఇది నా ఏరియా, నా జాగ' అంటూ 'కెంపె గౌడ' అనే కన్నడ సినిమాలోని తన డైలాగ్‌నే మళ్లీ చెపుతున్నట్టుగా అరుస్తాడు. అజిత్ సినిమా 'వేదాళం' 2015లో వచ్చింది. ఎనిమిదేళ్ల తర్వాత అగ్రహీరోతో అదే కథతో చేయటం పెద్ద సాహస మనే చెప్పాలి. 'మిల్కీ బ్యూటీ నువ్వే నా స్వీటీ', "జాం జాం జజ్జనక" పాటలు ప్రధాన కథలో అతికినట్టుగా లేవు.

జైలర్ ... పర్లేదు : రజనీకాంత్, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, సునీల్, రమ్య కృష్ణ, వినాయకన్, మిర్నా మీనన్, తమన్నా, యోగి బాబు తదితరులు నటించిన చిత్రం 'జైలర్'. 1999లో వచ్చిన 'నరసింహ' సినిమా తర్వాత 'జైలర్'లో రజనీ, రమ్యకృష్ణ కలిసి నటించారు. గుడిలో విగ్రహం చోరీతో కథ మొదలవుతుంది. వర్మ (వినాయకన్) అనే స్మగ్లర్ ఆ పని చేస్తాడు. ముత్తు (రజనీకాంత్) ఒక రిటైర్డ్ జైలర్. అతని కొడుకు స్మగ్లింగ్ ముఠా కార్యకలాపాలపై కన్నేసిన ఏసీపీ. అతన్ని ఆ స్మగ్లింగ్ గ్యాంగ్ కిడ్నాప్ చేస్తుంది. చనిపోయాడని కూడా కబురందుతుంది. ముత్తు ఆ గ్యాంగ్‌పై ప్రతీకారం తీర్చుకోవడమే కథ. హిందీలో పూరీ జగన్నాథ్ తీసిన 'బుడ్డా హోగా తేరా బాప్' చిత్రం ఛాయలు ఆద్యంతం కనిపిస్తాయి. క్లైమాక్స్‌లో కమల్ హాసన్ 'భారతీయుడు' పోలికలు కనిపిస్తాయి. హాలీవుడ్ మూవీ 'ఎక్స్పెండిబుల్స్'లో లాగా సీనియర్ హీరోలు ఒక్కొక్కరు కథలోకి ప్రవేశిస్తుంటారు. ఇలా రకరకాల పాత సినిమాల ఫ్లేవర్ తగులుతున్నా మేకింగులో ఉన్న స్టైల్ వల్ల కొత్తగానే అనిపిస్తుంది. కొన్ని అతి పోకడలు, విలన్ గ్యాంగులో ఓవరాక్షన్లు ఉన్నా అవన్నీ కథనంలో కలిసిపోయేలా ఉన్నాయి. క్లైమాక్స్‌ని ఊహించని విధంగా ముగించడంతో కుర్చీలోంచి లేచి వెళ్లే ప్రేక్షకుడికి సంతృప్తి కలుగుతుంది. ఫ్లాష్ బ్యాక్‌లో తిహార్ జైలుకి జైలర్‌గా 1980ల నాటి వింటేజ్ రజనీకాంత్‌ని తలపించాడు. మేకప్, హెయిర్ స్టైలిస్ బాగా చూపించారు. జాకీ ష్రోఫ్ ఎపిసోడ్ రొటీన్‌గా ఉంది. శివరాజ్ కుమార్ ట్రాక్ బాగుందనిపిస్తే, మోహన్ లాల్ పార్ట్ అంతగా నప్పలేదు. దర్శకుడు



నెల్సన్ ఈ తరం ప్రేక్షకుల నాడికి తగ్గట్టుగా కథనాన్ని మలిచారు. సుత్తితో మొహం పగలగొట్టడం, చెవులు కత్తితో తెగ్గొట్టేయడం లాంటి హింసాత్మక సన్నివేశాలు చిరాకు పెట్టిస్తాయి. గత కొన్నేళ్లుగా వచ్చిన రజనీకాంత్ సినిమాల్లో ఇదే బెస్ట్ అన్నట్టుగా ఉంది.

సాగరతీరంలో ఎపిఎల్ 3కె రన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 ప్రచార కార్యక్రమాల్లో భాగంగా విశాఖ సాగరతీరంలో ఆదివారం చేపట్టిన 3కె రన్ ఉత్సాహంగా సాగింది. ఆర్‌కె.బీచ్ వద్దనున్న కాళీమాత ఆలయం నుంచి పామ్ బీచ్ వరకూ ఎపిఎల్ రన్ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎసిఎ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎపి నుంచి ఐపిఎల్‌కు ఆటగాళ్లను సన్నద్ధం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎపిఎల్-1 మాదిరిగానే ఎపిఎల్-2నూ క్రికెట్ అభిమానులు ఆదరించాలని కోరారు. ఈ నెల 16 నుంచి 27 వరకూ వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ లీగ్ జరుగుతుందని, 120 మంది ఆంధ్రా యువ క్రికెటర్లు పాల్గొంటారని వెల్లడించారు. తొలుత రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో - ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ హరి వెంకట కుమారి, ఎసిఎ అధ్యక్షులు పి.శరత్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఎపిఎల్ 3కె రన్ కార్యక్రమంలో భాగంగా గాల్లోకి బెలూన్లు ఎగురవేస్తున్న అమర్‌నాథ్, వైవి.సుబ్బారెడ్డి, గోపీనాథ్‌రెడ్డి

స్పోర్ట్స్ స్కూల్‌లో 'పశువు'?!

- బాలికలపై ఓఎస్‌డి లైంగిక వేధింపులు
- తెలంగాణ క్రీడారంగంలో కలకలం రేపుతున్న ఘటన




ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభం శుభం తెలియని బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి (పశువుల డాక్టర్) హరికృష్ణ గర్ల్స్ హాస్టల్ గెస్ట్ హౌస్‌లో తిష్ట వేసి అమ్మాయిలను వేధిస్తున్నట్టు ఓ పత్రిక కథనం వెలువరించటంతో..తెలంగాణ క్రీడా వర్గాల్లో తీవ్ర దుమారం రేగుతుంది.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి హరికృష్ణ అక్కడి బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. కొంతకాలంగా బాలికల వసతి గృహంలోని గెస్ట్ హౌస్ కేంద్రంగా రాత్రిళ్లు బాలికలను లైంగికంగా వేధిస్తున్నట్టు ఓ పత్రిక కథనం ప్రచురించింది. స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణపై లైంగిక ఆరోపణల వార్తలతో తెలంగాణ క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్పెషల్ ఆఫీసర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేస్తూ.. పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

ఏం జరిగింది? :

పశుసంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ డాక్టర్ హరికృష్ణ డిప్యూటేషన్‌పై 2019 నుంచి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా స్పోర్ట్స్ హాస్టల్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారుల దృష్టికి సైతం వచ్చినట్టు సమాచారం. దీనిపై అంతర్గత విచారణ జరిపినా.. మంత్రి అండదండలు హరికృష్ణకు ఉండటంతో చర్యలకు ఉన్నతాధికారులు వెనుకాడినట్టు సదరు కథనం సారాంశం. ఈ విషయాన్ని కొందరు కోచ్‌లు, మహిళా ఉద్యోగినులు లేవనెత్తినట్టు తెలుస్తోంది. బాధిత బాలికలు అక్కడి మహిళా ఉద్యోగులతో తమకు జరిగిన అన్యాయంపై బోరుమన్నట్టు సమాచారం. రాత్రి సమయాల్లో ఓఎస్‌డి హరికృష్ణ బాలికల వసతి గృహంలోని గెస్ట్ హౌస్‌లోనే ఉంటున్నాడని అనేందుకు సీసీటీవీ ఫుటేజీ ఆధారాలు చాలని అంటున్నారు. ఇది కాకుండా, స్పోర్ట్స్ స్కూల్‌లోనే పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగితో సైతం ఓఎస్‌డి రాసలీలలు నడుపుతున్నట్టు సదరు కథనం వెల్లడించింది.



ఎవరీ హరికృష్ణ : పశు సంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ డాక్టర్ హరికృష్ణ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడు. 2025 వరకు సొంత శాఖ నుంచి డిప్యూటేషన్ తెచ్చుకున్నారు. మంత్రి ఆశీర్వాదంతో క్రీడాశాఖలో కీలక పదవి చేపట్టారు. స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డిగా ఉండేందుకు స్పోర్ట్స్‌లో కనీసం పిహెచ్‌డి అవసరం. క్రీడల్లో ఎటువంటి ప్రావీణ్యం లేని వ్యక్తిని ముఖ్యమైన క్రీడా పాఠశాలకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. దీనిపై ప్రశ్నించిన ఓ మహిళా కోచ్‌ను జిల్లా క్రీడాధికారి పదవి నుంచి తప్పించి.. తిరిగి కోచ్‌గా డిమోషన్ చేయటం గమనార్హం. స్పోర్ట్స్ స్కూల్ బాలికలపై లైంగిక వేధింపులపై స్పందించిన బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపిఎల్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..'ఓ వెటర్నరీ డాక్టర్‌కు స్పోర్ట్స్ స్కూల్‌లో ఏం పని?. ఎవరి ఈయను పశుసంవర్ధక శాఖ నుంచి క్రీడాశాఖకు బదిలీ చేశారు? హరికృష్ణను తక్షణమే భర్తరఫ్ చేయాలి. మంత్రి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ వ్యవహారాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలి' అని డిమాండ్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను హరికృష్ణ ఖండించారు. తనపై వస్తున్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదని, విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68